బాలయ్య రోడ్‌షో సూపర్‌హిట్

- ఈలలు, కేరింతల మధ్య రాపూరు, గూడూరు సభలు





గూడూరులో బాలకృష్ణకు నిమ్మమాలతో స్వాగతం



రాపూరు సభలో బాలయ్య అభివాదం

వెంకటగిరి/డక్కిలి/గూడూరు, ఏప్రిల్ 27: స్వర్ణాంధ్ర సాకారయాత్రలో భాగంగా సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ రాపూరు, గూడూరు పర్యటన విజయవంత మైంది.శనివారం సాయంత్రం రాపూరులో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగం ఆద్యంతం జనాలను హుషారెత్తించేలా సాగింది.బందోబస్తులో ఉన్న పోలీసుల వైపు చూసి 'ఏమ్మా... మీకు టీఏలూ, డీఏలూ, సెలవులు, అలవెన్సులు ఇస్తున్నారా?.. కనీసం జీతాలైనా సక్రమంగా ఇస్తున్నారా ..? ' అని ప్రశ్నించారు. వారు మౌనంగా వుండిపోవడంతో 'ఎందుకమ్మా మీకు.. ఈ బానిస బతుకులు... ఉంటే రౌడీ ఇన్‌స్పెక్టర్‌లా ఉండండి.వ్యవస్థలన్నింటినీ నాశనం చేశాడు జగన్ పిచ్చోడు. ఇంకా ఎందుకు ఊడిగం చేస్తారు' అని ప్రశ్నించారు.మాట్లాడితే సిద్ధం అంటున్నాడు జగన్ . ఆయన దేనికి సిద్ధం... ? తల్లిని, చెల్లిని గెంటేసేందుకు సిద్ధమా? సొంత బాబాయిని హత్య చేసిన నిందితులను కాపాడేందుకు సిద్ధమా.. యువతకు ఉద్యోగాలు ఇస్తామని మోసం చేసేందుకు సిద్ధమా ? అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తానని ఉద్యోగులను మోసం చేసినందుకా.. ఎందుకు సిద్ధమో తేల్చాలన్నారు. అధికార మదంతో రూ. 16 వందల కోట్ల ప్రజాధనాన్ని సిద్ధం సిద్ధం.. అంటూ బోర్డులకు ఖర్చు పెట్టారని బాలకృష్ణ ఆరోపించారు. ఇక్కడ పసుపు దండు కదిలితే అక్కడ జగన్ గుండె దడదడా కొట్టుకుంటుందన్నారు. జగన్‌కు పిచ్చి బాగా ముదిరిందని ప్రజలు ఎన్నికల్లో ఆ పిచ్చిని దించాలన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన పోవాలంటే ఎన్డీయే కూటమి విజయంతోనే సాధ్యమన్నారు. ప్రజలు తమ ఓటు అనే ఆయుధంతో జగన్‌ను తరిమికొట్టాలన్నా రు.ప్రచారరథంపై పక్కనున్న అభ్యర్థులను చూపిస్తూ రానున్న ఎన్నికల్లో వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణను, తిరుపతి ఎంపీగా బీజేపీ అభ్యర్థి వరప్రసాద్‌ను గెలిపించాలని కోరారు.టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్, అధికార ప్రతినిధి శ్రీధర్‌వర్మ, పార్టీ నాయకులు దందోలు వెంకటేశ్వర రెడ్డి, రాఘవరెడ్డి, కోటేశ్వరరావు, కేఎంకే ప్రసాద్‌నాయుడు, అవ్వారు సత్యం, గంగాధర్,కాసా శ్రీనివాసులు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.అనంతరం బయల్దేరి గూడూరుకు చేరుకున్న బాలకృష్ణ కోర్టుసెంటర్ నుంచి ర్యాలీగా బయల్దేరారు.టీడీపీ అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో బాలకృష్ణకు నిమ్మకాయలతో చేసిన గజమాలతో ఘనస్వాగతం పలికారు. అక్కడినుంచి కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, బాలకృష్ణ అభిమానులు బైక్‌ర్యాలీ చేపట్టారు. రోడ్డుకిరువైపులా అభిమానంతో ఎదురుచూస్తున్న జనానికి బాలయ్య కూడా చిరునవ్వులు చిందిస్తూ అభివాదం చేశారు. అండర్‌బ్రిడ్జి మీదుగా వివేకానంద రోడ్డు, రైల్వేస్టేషన్‌రోడ్డు మీదుగా టవర్‌క్లాక్ సెంటర్‌కు ర్యాలీ ఉత్సాహంగా సాగింది. టవర్‌క్లాక్ సెంటర్ వద్ద నిర్వహించిన సభలో బాలయ్య ప్రసంగం జనాన్ని ఉర్రూతలూగించింది.లెజెండ్ సినిమాలో మహిళాశక్తిని పొగుడుతూ బాలయ్య చెప్పిన డైలాగ్ ఇక్కడ చెప్పడంతో జనాలు చప్పట్లతో హోరెత్తించారు. జగన్ అరాచక పాలన గురించి బాలయ్య తనదైన శైలిలో గుక్కతిప్పుకోకుండా డైలాగులు చెప్పడంతో కేరింతలు కొట్టారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, జనాల సమస్యలను పరిష్కరించడం కోసం పరితపించే జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్, రాష్ట్రాభివృద్ధిని కాంక్షించే చంద్రబాబుల కలయిక అరాచక జగన్ పాలనను అంతమొందిస్తుందన్నారు.టీడీపీ అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్, బీజేపీ అభ్యర్థి వరప్రసాదరావును గెలిపించాలని బాలయ్య కోరారు.

రాపూరు సభకు హాజరైన జనం



కవ్విస్తున్న వైసీపీ

- జనసేన అభ్యర్థి ప్రచారానికి అడ్డంకులు
- కయ్యానికి కాలుదువ్వుతున్న వైసీపీ శ్రేణులు



ఎస్వీ హైస్కూల్ సమీపంలో శనివారం ఉదయం జనసేన ప్రచారాన్ని అడ్డుకున్న వైసీపీ శ్రేణులు







ఎన్డీఏ కూటమి పార్టీల కార్యకర్తలపై వైసీపీ శ్రేణుల ముష్టిఘాతాలు

తిరుపతి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో 2019 వరకు ఒకటి, రెండు సమస్యాత్మక ప్రాంతాల్లో తప్ప మిగిలిన చోట్ల ప్రశాంతంగా ఎన్నికలు జరిగేవి. ఆ తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. తిరుపతిలో ఎన్నికలంటేనే సగటు ఓటరుకు వెగటు, భయం పుట్టేలా పరిస్థితిని మార్చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి జరిగిన ఎన్నికలన్నీ గొడవలు, రాళ్లదాడులు, దొంగ ఓటర్లను అడ్డుకోవడం వంటి సంఘటనల నడుమ ఉద్రిక్త వాతావరణమే కనిపించింది. స్థానిక సంస్థల ఎన్నికలు మొదలుకుని ఎంపీ ఉప ఎన్నిక, టౌన్‌బ్యాంకు, ఎమ్మెల్సీ ఎన్నికలు ఏ విధంగా జరిగాయో దేశం మొత్తం చూసింది. అలాంటి వాతావరణానికి అలవాటుపడి పైచేయిగా నిలిచిన వైసీపీ శ్రేణులు ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లోనూ అదే పంథాను అనుసరించే వ్యూహంతో ముందుకెళుతున్నట్లు కనిపిస్తోంది. టీడీపీ, బీజేపీ బలపరుస్తున్న జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు నామినేషన్ వేసినప్పటినుంచి వైసీపీ శ్రేణుల్లో ఆందోళన మొదలైంది. ఆరణి ర్యాలీలో వేలాదిగా తరలివచ్చిన జనవాహినిని చూసి వైసీపీ నాయకులు కుట్రకు తెరలేపినట్టుగా ప్రచారం జరుగుతోంది. జనసేన అభ్యర్థి ప్రచారం చేపట్టే ప్రాంతాల్లో ముందుగా వైసీపీ శ్రేణులు వాలిపోయి కవ్వింపు చర్యలకు దిగుతున్నాయి.

పోలీసుల ప్రేక్షకపాత్ర : ఎన్నికల ప్రచారంలో నాలుగైదు ఉద్రిక్త ఘటనలు చోటుచేసుకుంటున్నప్పటికీ పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడం అనుమానాలకు తావిస్తోంది. తిరుపతిలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలంటే ఎన్నికల కమిషన్ ప్రత్యేక దృష్టిపెట్టాల్సిన అవసరం వుంది. అధికార పార్టీకి పోలీసులు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఎన్డీఏ కూటమి నేతలు ఆరోపిస్తున్న నేపథ్యంలో ఇప్పటికైనా అప్రమత్తంగా వ్యవహరించాల్సివుంది.

● భూమనా...ఇది కడపకాదు

రాష్ట్రంలో రాక్షస పాలన జరుగుతోందనడానికి తిరుపతిలో వైసీపీ నేతలు చేస్తున్న అరాచకాలే నిదర్శనం. నాలుగు రోజులుగా ఎంత కవ్విస్తున్నా శాంతియుతంగా వెళ్తున్నాం. 99సార్లు శాంతియుతంగా ఉండమనే మా నాయకుడు పవన్ కల్యాణ్ చెప్పారు. పరిస్థితి చేయిదాటిపోతే యుద్ధంలో దిగడమే. ఎన్నికల అధికారుల దగ్గర అనుమతి తీసుకుని ముందుగా ప్రచారానికి వెళుతుంటే, మేం వెళ్లే దారిలో అడ్డంవచ్చి దారివదలకుండా రౌడీమూకలు అడ్డుకుంటున్నాయి. గంజాయి మూకలతో బెదరగొట్టాలని చూస్తున్నారు. ఇలాంటి తాటాకు చప్పుళ్లకు భయపడం. తిరుపతి వాళ్ల అబ్బసొత్తుకాదు. ఇది ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని తిరుపతి మాత్రమే. కడప సంస్కృతి తీసుకొస్తామంటే కుదరదు.

- ఆరణి శ్రీనివాసులు, జనసేన అభ్యర్థి

● సౌమ్యులమైన మాపై నిందలా ?

తిరుపతిలో భయోత్పాతం సృష్టించేందుకు ఎన్డీఏ కూటమి కుట్ర చేస్తోంది. చిత్తూరు, వేలూరు నుంచి రౌడీలను తీసుకొచ్చేశారు. 25మంది బయటిప్రాంతంవారు పోటీలో ఉండారంటే పరిస్థితి ఏంటో తెలియడంలేదు. సౌమ్యులుగా ఉన్న మా మీద ఏదో ఒక నెపం నెట్టే కుట్ర కూటమి చేస్తోంది.

- భూమన కరుణాకర రెడ్డి, ఎమ్మెల్యే

గిరిపురంలో ఉద్రిక్తత

ఆరణి ప్రచారాన్ని అడ్డుకున్న వైసీపీ శ్రేణులు

తిరుపతిలో జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో ఉద్రిక్తతలు చోటు చేసుకుంటున్నాయి. జనసేన అభ్యర్థి ప్రచారం చేపట్టే ప్రాంతాల్లో ముందుగా వైసీపీ శ్రేణులు వాలిపోయి కవ్వింపు చర్యలకు దిగుతున్నారు. నాలుగు రోజుల క్రితం 27వ డివిజన్లోని జబ్బార్ లేఅవుట్‌లో జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ప్రచారానికి వెళుతుంటే వైసీపీ కార్యకర్తలు కూడా ప్రచారం పేరిట రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఎన్డీఏ కూటమి పార్టీ కార్యకర్తలు పట్టించుకోకుండా ప్రచారం చేపడుతూ దొడ్డాపురం వీధిలోకి వెళ్లిపోయారు. తాజాగా శనివారం గిరిపురంలో జనసేన అభ్యర్థి ప్రచారం చేసుకుంటూ వెళుతుంటే దారివ్వకుండా వైసీపీ కార్యకర్తలు ఇబ్బంది పెట్టారు. ప్రచారానికి వెళ్లకూడదంటూ అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య పిడిగుద్దులు, తోపులాటలతో ఉద్రిక్తత నెలకొంది. ఇంతలో సమాచారం అందుకుని అక్కడకు చేరుక్ను పోలీసులు ఇరువర్గాలకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఇంతలో టీడీపీ నేత మబ్బు దేవనారాయణ రెడ్డి తన అనుచరులతో అక్కడికి చేరుకోవడంతో ఇరువర్గాలు బాహాబాహీకి దిగాయి. పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఆరణి శ్రీనివాసులుతో పాటు టీడీపీ నాయకులు సుగుణమ్మ, నరసింహయాదవ్, ఊకా విజయకుమార్, దంపూరి భాస్కర యాదవ్, ఆర్సీ మునికృష్ణ, జనసేన నేతలు కిరణ్‌రాయల్, రాజా రెడ్డి, సుభాషిణి, ఆర్కాట్ కృష్ణప్రసాద్ తదితరులను తోపులాటల నడుమ పోలీసులు అనంత వీధివైపు పంపారు. అక్కడ వైసీపీ కార్యకర్తలు కొందరు గుంపులుగా చేరుకుని నినాదాలు చేయడం, ఇళ్లపైకి ఎక్కి జెండాలు ఊపుతూ కవ్వింపులకు దిగారు.అయితే మబ్బు యువసేన కార్యకర్తలు దీటుగా ప్రతిఘటించడంతో అక్కడినుంచి పలాయనం చిత్తగించారు.

ఘర్షణలకు తావు లేకుండా చర్యలు : ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం),ఏప్రిల్ 27: తిరుపతిలో ఎన్నికల ప్రచారంలో తలెత్తుతున్న ఘర్షణలను నివారించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ చెప్పారు.శనివారం గిరిపురంలో జనసేన అభ్యర్థి ప్రచారానికి దారివ్వకుండా వైసీపీ కార్యకర్తలు ఇబ్బంది పెట్టడంతో తలెత్తిన ఉద్రిక్త పరిస్థితులు పునరావృతం కాకుండా అధికారులతో సమీక్షించానన్నారు. ఇకపై రెండు పార్టీల అభ్యర్థులు ఒకే ప్రాంతంలో ప్రచారం చేసుకోకుండా చూస్తానన్నారు. ఎన్నికల ప్రచారాల్లో ఘర్షణ వాతావరణం సృష్టిస్తే కఠిన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వలంటీర్లతో వైసీపీ రాజకీయం

నేడు తిరుపతిలో చెవిరెడ్డి సమావేశం

తిరుపతి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి నియోజకవర్గంలో గౌరవ వేతనం తీసుకుంటూ ఇంతకాలం వలంటీర్లుగా వ్యవహరించిన వారంతా శనివారం పూర్తిగా విధుల నుంచీ తప్పుకున్నారు. వలంటీర్ల ముసుగు తొలగించి వందశాతం నిఖార్సైన వైసీపీ కార్యకర్తలుగా మారిపోయారు. కొంతకాలంగా రోజుకు కొందరు చొప్పున వలంటీర్లు చేసిన రాజీనామాలను శనివారం అధికారులు ఆమోదించారు.ఆదివారం ఈ మాజీ వలంటీర్లతో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి సమావేశం కానున్నట్టు తెలిసింది. ఎన్నికల ప్రచారంలోకి పూర్తి స్థాయిలో వారిని దించేలా దిశానిర్దేశం చేయనున్నట్టు సమాచారం. రానున్న పదిహేను రోజులూ వారికి కీలక బాధ్యతలు అప్పగించనున్నారని, అందులో తాయిలాల పంపిణీయే ప్రధాన బాధ్యతగా వుంటుందని తెలిసింది. కాగా దీనిపై టీడీపీ వర్గాలు కూడా అప్రమత్తమవుతున్నాయి. ఎమ్మెల్యే చెవిరెడ్డి మాజీ వలంటీర్ల కదలికలపై నిఘా వుంచినట్టు తెలిసింది. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వారు ఎలాంటి కార్యక్రమం చేపట్టినా ఫిర్యాదు చేసి అడ్డుకునేందుకు సన్నద్ధమై వున్నట్టు తెలిసింది.

నేడు వెంకటగిరికి సీఎం జగన్

వెంకటగిరి, ఏప్రిల్ 27 :ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నేడు వెంకటగిరికి రానున్నారు. ఆదివారం మధ్యాహ్నం 1.10 గంటలకు హెలికాప్టర్‌లో వెంకటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడినుంచి 1.15 గంటలకు ప్రచార వాహనంలో బయల్దేరి పట్టణంలోని త్రిభువని థియేటర్ కూడలిలో ఏర్పాటు చేసిన సభా స్థలానికి 1.25 గంటలకు చేరుకుంటారు.1.30 గంటల నుంచి 2.15 గంటల వరకు బహిరంగ సభలో ప్రసంగించి హెలికాప్టర్‌లో నెల్లూరు జిల్లా కందుకూరు వెళతారు.

ప్రశాంతంగా పాలిసెట్

తిరుపతి(విద్య), ఏప్రిల్ 27: పాలిసెట్ (పాలిటెక్నిక్ కోర్సుల ప్రవేశ పరీక్ష) జిల్లాలో ప్రశాంతంగా జరిగిందని కో-ఆర్డినేటర్, తిరుపతి ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకానాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం తిరుపతి, గూడూరు కేంద్రాలుగా ఈ పరీక్ష జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 86.53 (తిరుపతిలో 87.17 శాతం, గూడూరులో 84.34 శాతం) శాతం మంది విద్యార్థులు పరీక్ష రాశారని పేర్కొన్నారు. తిరుపతిలోని ఎనిమిది కేంద్రాల్లో 2,183 మంది బాలురు, 1,283 మంది బాలికలు మొత్తం 3,976 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 3,466 మంది పరీక్ష రాయగా, 510 మంది గైర్హాజరయ్యారు. గూడూరులోని ఆరు కేంద్రాల్లో 617 మంది బాలురు, 353 మంది బాలికలు మొత్తం 1,150 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో.. 970 మంది పరీక్ష రాయగా, 180 మంది గైర్హాజయ్యారు. జిల్లా వ్యాప్తంగా 5,126 మంది దరఖాస్తు చేసుకోగా, 4,436 (2,800 మంది బాలురు, 1,636 మంది బాలికలు) మంది పరీక్ష రాయగా, 690 మంది గైర్హాజరయ్యారని వివరించారు. అలాగే ప్రశాంతంగా పరీక్ష నిర్వహించిన అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ ఆర్వీ రమణకుమార్, హెడ్ ఆఫ్ ది జనరల్ సెక్షన్ డాక్టర్ ఎస్వీ గౌరీశంకర్‌తోపాటు చీఫ్ సూపరింటెండెంట్లు, పరిశీలకులు, రూట్ ఆఫీసర్లు, ఇతర సిబ్బందికి జిల్లా కో-ఆర్డినేటర్ కృతజ్ఞతలు తెలిపారు.



టీడీపీ, బీజేపీ బలపరుస్తున్న జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు (జేఎంసీ) ప్రచారంలో దూసుకుపోతున్నారు.కూటమిలోని అసమ్మతులంతా ఏకమై ఆరణి వెంట నడుస్తూ గాజు గ్లాసు గుర్తుకు ఓటువేయాలని అభ్యర్థిస్తున్నారు. రోజురోజుకూ తనకు పెరుగుతున్న ఆదరణ చూసి ప్రత్యర్థుల వెన్నులో వణుకుపుడుతోంది కాబట్టే కూటమి ప్రచారాలను నిలువరించేందుకు వైసీపీ కవ్వింపు చర్యలకు దిగుతోందని ఆరణి శ్రీనివాసులు ఆరోపిస్తున్నారు. తిరుపతిలో అరాచకాలు సృష్టించేందుకు వైసీపీ కుట్ర పన్నుతోందంటున్నారు. ప్రశాంతతకే తాము పెద్దపీట వేస్తామని, ఆ విషయంలో రాజీపడేదిలేదని చెబుతున్నారు. అహంకారపూరితమైన భూమన కుటుంబాన్ని భరించే ఓపిక తిరుపతి ప్రజలకు లేదంటున్నారు. 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో ఆరణి సంభాషణ ఆయన మాటల్లోనే...

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

భూమనను భరించే ఓపిక
ఇక తిరుపతికి లేదు

● పవన్ కల్యాణే ఇక్కడ అభ్యర్థి ● నేను ఆయన ప్రతినిధిని మాత్రమే

● జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు

● ఇక ఇక్కడే నా జీవితం

మా పిల్లలు జగన్, మదన్, అదేవిధంగా మా సోదరుల పిల్లలు అందరూ హైదరాబాద్, బెంగళూరుల్లో వ్యాపారరీత్యా స్థిరపడ్డారు. జేఎంసీ కనస్ట్రక్షన్స్ పేరిట భారీస్థాయి నిర్మాణ కాంట్రాక్టు పనులు చేస్తుంటారు. ఇక నేను, నా భార్య మాత్రమే ఉంటాం. తిరుపతిలో ప్రశాంత జీవితం గడిపేందుకు కలియుగ శ్రీనివాసుడే పిలిపించుకున్నాడేమో అనిపిస్తోంది. నా సొంత ఇల్లు పద్మావతి పురంలో ఉంది. తిరుపతే అన్నింటికీ కేంద్రం. ఇక్కడి నుంచే హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాలకు సులభంగా వెళ్లిరావచ్చు. అందువల్లే ఇకపై తిరుపతిలోనే నిత్యం అందరికీ అందుబాటులో ఉంటా.

● అబ్బాకొడుకులు నియంతల్లా మారారు

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల మాయాజాలంతో ఎమ్మెల్యేగా ఓడి గెలిచిన భూమన కరుణాకర రెడ్డి టీటీడీ ఎక్స్అఫిషియో సభ్యుడయ్యాడు. అప్పటి నుంచే అధికార దుర్వినియోగానికి పాల్పడ్డాడు. రెండేళ్ల తర్వాత వచ్చిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజాస్వామ్యం పరిహసించేలా చేశారు. నిజంగా తిరుపతిని ఆయన అభివృద్ధి చేసివుంటే మున్సిపల్ ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా చూసేవారు. ఆయన కొడుకు భూమన అభినయ్ రెడ్డిని ప్రత్యక్ష రాజకీయాల్లోకి తీసుకొచ్చారు.ఓడిపోతామేమో అన్న భయంతో విపక్షాలను నామినేషన్లు వేయనీయకుండా అడ్డుకుని కొడుకును ఏకగ్రీవం చేసుకున్నారు. డిప్యూటీ మేయర్ పదవి తెచ్చుకుని మేయర్ అధికారాలను లాక్కున్నాడు. జగన్ రెడ్డి కాళ్లావేళ్లాపడి ఆఖరి సంవత్సరంలో టీటీడీ ఛైర్మన్ పదవి తెచ్చుకున్నాడు. అప్పటినుంచి ఆయన అసలు స్వరూపం ప్రదర్శించాడు. ఆయన కుటుంబానికే పదవులన్నీ ఇచ్చుకుంటూ, ఎదురుతిరిగేవాళ్లను అణగదొక్కుతూ అబ్బాకొడుకులు నియంతల్లా మారారు.

వెంకన్న ఆశీస్సులు, పవన్ దయ

తిరుపతి నుంచి పోటీ చేయాలన్న ఆలోచన నాలోలేదు. ఏడుకొండల వెంకన్న స్వామి ఆశీస్సులు, మా అధినేత పవన్ కల్యాణ్ దయతో రావాల్సి వచ్చింది.మూడు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నా. ప్రజారాజ్యం, తెలుగుదేశం, వైసీపీ ఇలా మూడు ప్రధాన రాజకీయ పార్టీలకు జిల్లా అధ్యక్షుడిగా పనిచేశా. దీంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో భాగమైన తిరుపతినుంచే రాజకీయ కార్యాకలాపాలు సాగించా. ఇక్కడే విస్తృతమైన పరిచయాలున్నాయి. గతంలో రెండు సార్లు ఓడిపోయినా.. ప్రజారాజ్యంలో నైతికంగా గెలిచి సాంకేతికంగా ఓడిపోయాను. ఆ తర్వాత 2019లో ఎమ్మెల్యేగా గెలిచాను. మరోసారి తిరుపతి నుంచి ఎన్డీఏ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం వచ్చింది.

● తిరుపతి పేరును చెడగొట్టారు

ఒకప్పుడు తిరుపతి అంటే కొండమీద వెంకటేశ్వర స్వామి, కొండ లడ్డు, విద్యాసంస్థలు, ఆస్పత్రులు గుర్తుకువచ్చేవి. ఇప్పుడు తిరుపతి పేరు చెప్పగానే దొంగ ఓట్లు, టీడీఆర్ బాండ్ల కుంభకోణాలు, డ్రగ్స్, గంజాయి, భూ మాఫియాల గురించే చెప్పుకుంటున్నారు. బయటప్రాంతాల వాళ్లు కూడా 'అమ్మో...తిరుపతి' అన్నంతగా తండ్రీ కొడుకులు భయపెట్టేశారు. మరోసారి భూమన కుటుంబం గెలిస్తే తిరుపతిలో బతకలేమని, ఈసారి గెలిపించబోమని కూడా ఎంతోమంది నాకు చెబుతున్నారు.

● అహం, పొగరు.... తిరుపతి భరించదు

తండ్రీకొడుకుల అహం, పొగరును తిరుపతి ప్రజలు భరించలేకపోతున్నారు. వారి చుట్టూ ఉన్న సామాజికవర్గాన్ని కూడా మోసం చేశారు. అన్ని వర్గాలూ అసంతృప్తితో ఉన్నాయి. ఎమ్మెల్యే అభ్యర్థి అభినయ్ రెడ్డి ప్రత్యర్థుల గురించి మాట్లాడిన వీడియోను మావాళ్లు చూపెట్టారు. ప్రత్యర్థులను



■ ఇంటర్వ్యూ

వాడూ, వీడూ అని సంబోధించడం ఏమిటి? గెలవకముందే ఇలా వున్నాడంటే, పొరబాటున గెలిస్తే అతని వ్యవహార శైలిని ఊహించగలమా? ఆత్మీయ సమావేశాల్లో పెద్దల దగ్గర నక్క వినయాలు ప్రదర్శించడం తప్ప తన అసలు స్వరూపం మాత్రం ప్రజలకు తెలియదనుకుంటున్నాడు. యువతకు ఉపాధి అవకాశాలన్నీ పోయాయి. అన్నీ కక్షకట్టి చేస్తున్నారు. అమరరాజాను తరిమికొట్టారు. ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టారు. రాష్ట్రంలో జగన్ కంటే ముదురు మూర్ఖుడు కరుణాకర రెడ్డి. అతని నైజమేంటో తిరుపతి ప్రజలందరికీ తెలుసు.

● దొంగ ఓట్ల కుంభకోణం

తిరుపతిలో దొంగ ఓట్ల కుంభకోణం వెలుగులోకి రావడంతో దేశం మొత్తం ఉలిక్కిపడింది. తండ్రీ, కొడుకుల వికృతానందానికి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో పాటు కింది స్థాయి అధికారులు, సిబ్బంది ఎందరో బలైపోయారు. కుంభకోణానికి ప్రధాన సూత్రధారులైన వీరిపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలి. ఆ దిశగా విచారణ జరుగుతోందని ఆశిస్తున్నా. దొంగ ఓట్ల కుంభకోణం చేసి ఏ ముఖం పెట్టుకుని ఓట్లడుగుతారు. తిరుపతి

తిరుపతిని అభివృద్ధి చేసింది ఎన్టీఆర్, చంద్రబాబే

తిరుపతిలో నిర్మాణాత్మక అభివృద్ధికి బాటలు వేసింది దివంగత నేత నందమూరి తారకరామారావు, ఆ తర్వాత అభివృద్ధిని పరుగులు పెట్టించింది నారా చంద్రబాబు నాయుడు. స్విమ్స్ ఆస్పత్రి ఏర్పాటు, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం స్థాపన, తిరుమలలో ఉచిత అన్న ప్రసాదం, ప్రాణదాన పథకం ఇలా చెప్పుకోదగ్గవన్నీ టీడీపీ హయాంలో జరిగినవే. అదేవిధంగా చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు వెంకయ్య నాయుడి సహకారంతో తిరుపతికి స్మార్ట్ సిటీ నిధులు తీసుకొచ్చారు. ఆ నిధులతో గరుడ వారధి, రోడ్లు, ఫుట్‌పాత్‌లు, ఆడిటోరియాలతో నగరసుందరీకరణకు బీజం వేసింది చంద్రబాబే. గతంలో ప్రారంభమైన ప్రాజెక్టులను రీటెండరింగ్ పేరుతో వైసీపీ ఆలస్యం చేసి, ప్రజలను ఇబ్బందులు పెట్టారు.టీటీడీ, స్మార్ట్ సిటీ, మున్సిపల్ నిధులతో అభివృద్ధి చేసిందే తప్ప జగన్ రెడ్డి ప్రత్యేకంగా తిరుపతి అభివృద్ధికి ప్యాకేజీ ఇచ్చిందేమీలేదు.

రాజారెడ్డి పాలనతో తట్టుకోలేక పోతున్నామని, మళ్లీ గెలిస్తే ఇక అంతేనని ప్రజలు చెబుతున్నారు.

● మాస్టర్ రోడ్ల వక్ర మార్గం

జనావాసాలు లేని చోట్ల, వాళ్ల ఆస్తులున్న చోట్ల నాలుగు రోడ్లువేసేసి అభివృద్ధి చేసేశామని వైసీపీ నేతలు బాకా ఊదుకుంటున్నారు. దీని వెనుక టీడీఆర్ బాండ్ల కుంభకోణం వెలుగు చూసింది. వేలకోట్ల రూపాయల అవినీతి జరిగింది. జగన్మోహన్ రెడ్డి లక్షల కోట్లు సంపాదిస్తే ఇక్కడున్నవారు వేల కోట్లు దోచుకున్నారు. తిరుపతిలో ఎవర్నడిగినా మాస్టర్ ప్లాన్ రోడ్ల వెనుక మర్మమేంటో చెబుతున్నారు.ఇక నగరంలో విస్తరించిన రోడ్లలోనూ తండ్రీకొడుకుల వక్రబుద్ధి బయటపడింది. వారికి అనుకూలంగా ఉన్నవారు, లంచాలిచ్చినవారి స్థలం ఉన్నచోట నాలుగైదు అడుగులు వదిలేసి వాటి ఎదురుగా ఉన్న సామాన్యుల స్థలాన్ని అనుకున్నదానికన్నా ఎక్కువగా రోడ్డుకు కలిపేశారు. ఒక రోడ్డుకూడా చక్కగా కనిపించదు. ఏరోడ్డు చూసినా వక్రమార్గమే. వారి బుద్ధిమల్లే!

● పోల్ మేనేజ్‌మెంట్‌లో పక్కా ప్రణాళిక

ఎన్నికల ప్రక్రియలో పోల్‌మేనేజ్‌మెంట్ కీలక దశ. ఇక్కడ బలమైన ఎన్డీఏ కూటమి ఉందన్న విషయం వైసీపీ శ్రేణులు గుర్తుపెట్టుకోవాలి. గత 40 ఏళ్లుగా టీడీపీకి పటిష్ఠమైన వ్యవస్థ ఉంది, బలమైన నాయకత్వం ఉంది. అన్నింటికి మించి గట్టి ఓటు బ్యాంకు ఉంది. ఇక ఉత్సాహం ఉరకలెత్తే జనసైనికులు వేలాదిగా ఇక్కడ ఉన్నారు. బీజేపీ నాయకులు ఒక్కొక్కరు వందమందితో సమానం. ఇంతకన్నా పోల్ మేనేజ్‌మెంట్ ఇంకేం కావాలి. వైసీపీ నేతలు కావాలనే గొడవలకు దిగి కూటమి నేతలపై చేయివేస్తే, మా రక్తపు బొట్టు కిందపడితే జనసేనాని పవన్ కల్యాణ్ గంటలో వచ్చి వాలిపోతారు. ఆ విషయం వాళ్లు గుర్తుపెట్టుకోవాలి.

● ప్రశాంతతకు పెద్దపీట

ప్రశాంత జీవితం గడపాలని తిరుపతిలో స్థిరపడుతుంటారు. ముఖ్యంగా స్థానికులకు రచ్చలు, కక్షలు అంటే నచ్చదు. వారి అభిరుచి మేరకు తిరుపతి ప్రజలకు ఏ ఇబ్బందీ రాకుండా చూస్తా. ఒకవేళ అసాంఘిక శక్తుల వల్ల ప్రజలకు ఇబ్బందులు తలెత్తితే వాటిని ఎదుర్కోవడానికి కూడా సిద్ధంగా ఉన్నాం. చంద్రబాబు అనుభవం, నరేంద్ర మోదీ సహకారం, పవన్ ఆశయాలతో సరికొత్త తిరుపతిని చూడబోతున్నారు.

తిరుపతిలో పవన్ ప్రతినిధిగానే నేను..

మెగాస్టార్ చిరంజీవిని అక్కున చేర్చుకున్న తిరుపతి అభివృద్ధిపై మా అధినేత పవన్ కల్యాణ్‌కు ప్రత్యేకమైన అజెండా, వల్లమాలిన ప్రేమ ఉన్నాయి. జనసేన అభ్యర్థిగా ఆయనే పోటీచేయాల్సింది. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఆయన పిఠాపురం వెళ్లాల్సి వచ్చింది. ఆయన ఇంటి మనిషిగా, ఆయన ప్రతినిధిగా నేను ఇక్కడ నిలబడ్డా. ఆయనే ఇక్కడ ఎమ్మెల్యే. ఆయన ఏమి చెబితే అది చేసే బాధ్యతనాది. ఏడు పదుల వయసు దాటినా ఇక్కడి ప్రజలు చూపిస్తున్న ఆదరాభిమానాలతో అలుపూసొలుపూ లేకుండా మండే ఎండలను సైతం లెక్కచేయకుండా ప్రచారంలో ఉత్సాహంగా సాగిపోతున్నా.

కూటమికొస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేకే...

ఎన్డీఏ కూటమికి రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణ చూసి వైసీపీ శ్రేణుల్లో అసహనం మొదలైంది. ముఖ్యంగా మా నామినేషన్‌కు వచ్చిన జనాన్ని చూసి వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి. అది తట్టుకోలేక మా ఎన్నికల ప్రచారంలో వైసీపీ మూకలు గొడవలకు దిగుతున్నాయి. పోలీసుల అనుమతి తీసుకుని మేం ప్రచారం చేస్తుంటే కావాలనే వైసీపీ శ్రేణులు అక్కడకు వచ్చి కవ్వింపు చర్యలకు దిగుతున్నాయి. నేను గుడికి పోతున్నానని తెలుసుకుని వైసీపీ అభ్యర్థి నాకంటే ముందుగా అక్కడకు చేరుకుని నాకు షేక్ హ్యాండ్ ఇస్తారు. మసీదుకు పోతే తనవాళ్లతో ఇబ్బందిపెట్టాలని చూస్తారు. ఇలాంటి చీప్ ట్రిక్స్ మానుకుంటే మంచిది.కరుణాకర రెడ్డి వచ్చినప్పటి నుంచే తిరుపతిలో కడప సంస్కృతి పెరిగిపోయింది. ఇకపై అది కుదరదు. మా నాయకుడు పవన్ కల్యాణ్ 99 సార్లు ప్రశాంతంగానే భరించమంటారు. ఆ తర్వాత ఆ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో యుద్ధం ప్రకటిస్తాం. విజయంతో వస్తాం.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న



చంద్రగిరి, ఏప్రిల్ 27: శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేతంగా స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఉత్సవర్లను కల్యాణ మండపంలో వేంచేపు చేసి, కల్యాణోత్సవం నిర్వహించారు. వారోత్సావాల సందర్భంగా సాయంత్రం ఉత్సవర్లకు ఊంజల్ సేవ కన్నులపండువగా జరిగింది. అనంతరం స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

'జగనాసుర రక్తచరిత్ర' చార్జ్‌షీట్ ఆవిష్కరణ



తిరుచానూరు, ఏప్రిల్ 27: చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని శనివారం రాత్రి రఘునాథ రిసార్ట్స్‌లోని పార్టీ కార్యాలయంలో జగనాసుర రక్తచరిత్ర ఎన్డీయే చార్జ్‌షీట్‌ను ఆ పార్టీ నేతలతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలు, అరాచకాలపై టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఈ చార్జ్‌షీట్‌ను తయారు చేయడమైందన్నారు.

మురికికూపంలో 'దామినేడు' ప్రజలు



సమావేశంలో ప్రసంగిస్తున్న పులివర్తి సుధారెడ్డి

తిరుచానూరు, ఏప్రిల్ 27: దామినేడు హౌసింగ్ కాలనీ వాసులు మురికికూపంలో కొట్టుమిట్టాడుతున్నారని చంద్రగిరి టీడీపీ మహిళా నేత పులివర్తి సుధారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం రాత్రి దామినేడు ఇందిరమ్మ గృహాల్లో మహిళలతో కలిసి మహిళా శక్తికి అండగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రజల కష్టాలను పట్టించుకునే పరిస్థితిలో ఎమ్మెల్యే చెవిరెడ్డి లేడన్నారు. తన భర్త, చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని గత నెలలో ప్రచారంలో భాగంగా దామినేడులో పర్యటించినపుడు అక్కడ పరిస్థితిని చూసి చలించిపోయారన్నారు. వెంటనే ఎక్స్‌కవేటర్లు పెట్టి తాత్కాలికంగా శుభ్రం చేయించారని గుర్తు చేశారు. ఇక్కడి పరిస్థితులు మారాలంటే పులివర్తి నానీని గెలిపించాలని చెప్పారు.

వైభవంగా వసంతోత్సవం

రామచంద్రపురం, ఏప్రిల్ 27: శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా గంగిరెడ్డి పల్లె, కమ్మకండ్రిగ, మెట్టూరు, నడవలూరు గ్రామాల్లో శనివారం వసంతోత్సవం వైభవంగా జరిగింది. ఆలయాల్లో సీతారాములకు తిరుమంజనం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు, పెద్దలు వసంతాలు చల్లుకుని సంబరాలు జరుపుకున్నారు. రాత్రి 8గంటల ప్రాంతంలో నార దుస్తులు ధరించిన సీతారాముల ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై మేళతాళాల నడుమ ఊరేగించారు.



గరుడ వాహనంపై ఊరేగుతున్న సీతారాములు

చంద్రగిరి

ఆటో అద్దె చెల్లించలేదని దాడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శరవణ

చంద్రగిరి, ఏప్రిల్ 27: ఆటో అద్దె చెల్లించలేదని ఓ వ్యక్తిపై ముగ్గురు యువకులు తీవ్రంగా దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తొండవాడ పంచాయతీ అరుణకాలనీకి చెందిన శివయ్య కుమారుడు శరవణ చంద్రగిరికి చెందిన అన్వర్‌బాషా వద్ద ఆటోను అద్దెకు తీసుకుని నడుపుతున్నాడు. రోజూ అద్దె చెల్లించలేక.. రూ.16వేల వరకు బకాయి పడ్డాడు. దాంతో ఆటో నడపటం మాని, చంద్రగిరిలోని ఓ పెట్రోల్ బంకులో పనిచేస్తున్నాడు. ఈనెల 24వ తేదీ రాత్రి అన్వర్‌బాషా, హర్ష, అబ్బులు కలిసి శరవణను పిలిచి, ఓ గదిలో బంధించి చెక్క రీపర్లతో తీవ్రంగా దాడి చేశారు. అపస్మారకస్థితికి చేరుకున్న అతడిని అర్ధరాత్రి సమయంలో తొండవాడ సమీపంలో రోడ్డు పక్కన పడేశారు. 25న ఉదయం స్థానికులు గమనించి, చికిత్స నిమిత్తం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. బాధితుడు స్పృహలోకి వచ్చాక విషయం బయటపడింది. శరవణ ఫిర్యాదు మేరకు పోలీసులు అన్వర్‌బాషా, హర్ష, అబ్బులపై కేసు నమోదు చేశారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి

రామచంద్రపురం, ఏప్రిల్ 27: విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని పలువురు వక్తలు సూచించారు. శనివారం వెంకటాపురం సమీపంలోని సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాలలో కల్చరల్ ఫియస్టా-24 పేరుతో సాగిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాల్ ఎం.నిరంజన్‌బాబు, పలు ఫార్మసీ కళాశాలలకు చెందిన ప్రొఫెసర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా శిక్షణ శిబిరాలు లేనట్టేనా?

తిరుపతి(క్రీడలు), ఏప్రిల్ 27: ఈ వేసవిలో క్రీడా శిక్షణ శిబిరాలు లేనట్టే కనిపిస్తోంది. మే ఒకటో తేదీ నుంచి శిబిరాలను ప్రారంభించాల్సి ఉన్నా.. ఇప్పటి వరకు ప్రభుత్వ నుంచి ఎటువంటి అనుమతులు రాకపోవడమే దీనికి కారణమని క్రీడాకారులు చెబుతున్నారు. వేసవి సెలవుల్లో ఏటా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఉచిత క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించడం ఆనవాయితీ. 8-14 ఏళ్లలోపు క్రీడలపై ఆసక్తి ఉన్న పిల్లలు ఉదయం, సాయంత్రం తమ సమీప శిబిరాల్లో శిక్షణ తీసుకునేవారు. ఈ ఏడాది కూడా మే 1నుంచి 31వ తేదీవరకు ఆర్చరీ, అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, హాకీ, బేస్‌బాల్, ఖోఖో, కబడ్డీ, యోగా, వాలీబాల్, రెజ్లింగ్, జూడో, తైక్వాండో, ఫెన్సింగ్, రైఫిల్ షూటింగ్, క్రికెట్, కరాటే, ఫుట్‌బాల్, షటిల్ తదితరాలకు జిల్లా వ్యాప్తంగా 80 శిక్షణ శిబిరాలను ఔత్సాహికులైన పీఈటీలు, పీడీలు, సీనియర్ క్రీడాకారులు, క్రీడా సంఘాలు, స్కూల్ గేమ్స్ కార్యదర్శులు సిద్ధం చేసుకున్నారు. ఈవివరాలతో ప్రతిపాదనలు శాప్‌కు పంపారు. అనుమతి కోసం నెల రోజులుగా ఎదురుచూపులే మిగిలాయి. ఇక మూడ్రోజుల వ్యవధి మాత్రమే ఉండటంతో అనుమతులు రావడం అనుమానమే అని క్రీడాభిమానులు అంటున్నారు.

753 బైండోవర్ కేసులు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 27: జిల్లాలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటినుంచి శుక్రవారం వరకు దాదాపు 753 బైండోవర్ కేసులు నమోదు చేశారు. అలాగే వివిధ కేసుల కింద దాదాపు 2,684 మందిని అదుపులోకి తీసుకుని.. సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. వీరిలో.. జూదం ఆడినవారు 68 మంది, సారాయి, అక్రమ మద్యం తరలిస్తూ పట్టుబడినవారు, గంజాయి విక్రయిస్తూ కేసులు నమోదైన వారు 97 మంది, గలాటాలు, ఘర్షణలు, విధ్వంసాలు, ఇంటి దొంగతనాలు, దోపిడీలకు పాల్పడిన వారు 1,246 మంది, శాంతి భద్రతలకు విఘాతం కల్గించిన 1,273 మంది ఉన్నారని అధికారిక సమాచారం. కాగా, గత రెండు దఫాలుగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ బూత్ వద్ద విధ్వంసాలు చేయడం, అభ్యర్థులను భయపెట్టడం, బూత్‌లోకి చొరబడి గలాటాలు చేయడం వంటి వారి కదలికలను పోలీసులు గుర్తించి చర్యలు తీసుకుంటున్నారు.

నామినేషన్ పండుగను నాశనం చేసిన చెవిరెడ్డి

● పులివర్తి సుధారెడ్డి



మాట్లాడుతున్న పులివర్తి సుధారెడ్డి

తిరుచానూరు, ఏప్రిల్ 27: చంద్రగిరిలో పండుగ వాతావరణంలో జరగాల్సిన నామినేషన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి నాశనం చేశారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి విమర్శించారు. శనివారం తిరుపతి రూరల్ మండలం రఘునాథ్ రిసార్ట్స్‌లోని స్వగృహంలో మీడియాతో మాట్లాడారు. మొన్న నామినేషన్ గొడవలు, నిన్న తిరుచానూరులో క్యాండిల్ ర్యాలీ గురించి నిజాలు తెలియజేయాలని మీడియా ముందుకు వచ్చానన్నారు. ఆమె మాటల్లోనే.. 'పది రోజులుగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు భారీస్థాయిలో టీడీపీలో చేరుతుండటాన్ని చూసి ఓర్వలేకే దాడుల కుట్రకు ఎమ్మెల్యే తెరలేపారు. పథకం ప్రకారం నామినేషన్ రోజు ఆర్డీవో కార్యాలయం ఎదుట టీడీపీ జెండాలను కింద వేసి తొక్కారు. రాళ్లు తెచ్చుకుని మా కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారు. ఎన్నికల అధికారులు మాత్రం ఏకపక్షంగా వ్యవహరించి మా కార్యకర్తలపై మాత్రమే కేసులు పెట్టారు. కొడుకును కూడా కొట్టించి సానుభూతి రాజకీయాలు చేయగల వ్యక్తి చెవిరెడ్డి. వైసీపీ కార్యకర్తలు మా కోడలి కారుపైకి కూడా వెళ్లారు. ఎమ్మెల్యే ఆడవారికి కనీసం గౌరవం ఇవ్వరని తెలుసు.. నామినేషన్ వేశాక వెళ్లిపోకుండా అక్కడే ఉండి రెచ్చగొట్టారు. తిరుచానూరులో ర్యాలీ ఎందుకు చేశారో అర్థం కాలేదు. పైగా ఎమ్మెల్యే కుల రాజకీయాలు మొదలుపెట్టారు. చెవిరెడ్డికి ఓట్లు వేసి.. నష్టపోయిన విషయాన్ని మారెడ్డి కులస్తులు తెలుసుకున్నారు. కుంట్రపాకం మాజీ సర్పంచ్ బుజ్జిరెడ్డి మా వద్దకు వచ్చి వైసీపీలో నష్టపోయానని చెప్పారు. ఆయన ఫొటోతో మాపై బ్లూ మీడియాలో కథనాలు రాయిస్తున్నారు. వైస్ ఎంపీపీ మాధవరెడ్డి అన్యాయం జరిగిందని ఎన్నోసార్లు మా వద్ద మొరపెట్టుకున్నారు. నామినేషన్ రోజు ఎమ్మెల్యే ట్రాప్‌లో ఇరుక్కోవడం ఇష్టం లేక వైసీపీ నేతలు కొందరు వెనక్కు వెళ్లారు. 10మంది ముందుకొస్తే 90మంది వెనక్కు వెళ్లిపోయారు. మేము కూడా కేసు పెడితే బలైపోయేది కార్యకర్తలే. మొదట ఆడవారిని గౌరవించడం చెవిరెడ్డి నేర్చుకోవాలి' అని సుధారెడ్డి హితవు పలికారు.

వైసీపీ నేతలు టీడీపీలో చేరిక

చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సమక్షంలో శనివారం రాత్రి పలువురు వైసీపీ నేతలు తెలుగుదేశంలో చేరారు. రఘునాథ రిసార్ట్స్‌లోని పార్టీ కార్యాలయంలో సప్తగిరి కాలనీ పంచాయతీకి చెందిన వైసీపీ కీలక నేత, రాష్ట్ర రజక సంఘం అధికార ప్రతినిధి మల్లెల నాగరాజుతోపాటు వార్డు మెంబరు కవిత, వారి మిత్రులు గురవయ్య, సి.బాబు, గాలి గణేష్‌నాయుడు, రాహుల్, నాగరాజు తదితరులు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పేశారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ వైసీపీలో సెకండ్ లీడర్‌ను ఎదగనివ్వకుండా ఎమ్మెల్యే చెవిరెడ్డి కుటుంబ పాలన సాగిస్తూ వస్తున్నారని మండిపడ్డారు. పదేళ్లు రాబంధులా చంద్రగిరిని దోచుకుతిన్న ఎమ్మెల్యే ప్రజల బాధలు గాలికి వదిలేసి ఒంగోలుకు మకాం మార్చారని ధ్వజమెత్తారు.



నాని సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ నేతలు

వైసీపీ నేతలు మా ప్రచారాన్ని అడ్డుకుంటున్నారు

● అధికారులు, పోలీసులు వైసీపీకి సహకరిస్తున్నారు.

● కలెక్టర్‌కు కూటమి నేతల ఫిర్యాదు



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఆరణి శ్రీనివాసులు

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 27: ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుంటే వారం రోజులుగా వైసీపీ నేతలు అడ్డుకుంటున్నారని తిరుపతి జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు శనివారం రాత్రి ఫిర్యాదు చేశారు.పోలీసులు, కొంతమంది అధికారులు వైసీపీ నేతలకు సహకరిస్తున్నారని వివరించారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ వైసీపీ నేతల ఆగడాలపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్న విషయాన్ని కలెక్టర్‌కు వివరించామన్నారు. నగరంలో 35వేల దొంగ ఓట్లున్న విషయాన్ని ఆధారాలతో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. చిత్తూరునుంచి రౌడీలను తీసుకువచ్చి దాడులు చేయాల్సిన అవసరం తనకు లేదని తెలిపారు.దొంగ ఓట్లు చేర్పించి రౌడీయిజం చేసి ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది భూమన కుటుంబమేనని ఆరోపించారు.తమ ప్రచారానికి వస్తున్న జనస్పందన చూసే వైసీపీ నేతలు ఇలాంటి కుయుక్తులకు పాల్పడుతున్నారన్నారు.

టమోటా నారు పెరికేసిన వైసీపీ కార్యకర్తలు

- పోలీసులకు జనసేన నాయకుడి ఫిర్యాదు

ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 27: జనసేన నాయకుడి పొలంలో నాటిన టమోటా నారును వైసీపీకి చెందిన కార్యకర్తలు పెరికి వేసినట్లు బాధితుడు శనివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు.. జనసేన మండల అధ్యక్షుడు ముండ్లపాటి మురళి చింతగుంట గ్రామంలోని తన పొలంలో నాలుగైదు రోజుల కిందట టమోటా నారు నాటాడు. ఈ నారును అదే గ్రామంలోని వైసీపీకి చెందిన నారాయణ, పార్థసారథి, నాగరాజలు పెరికేశారు. రాజకీయంగా కక్ష పెంచుకునే ఈ పనిచేశారని పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. వీరిపై తగిన చర్యలు తీసుకోవాలనీ కోరాడు.

న్యాయ వ్యవస్థకు మారుపేరు చిత్తూరు

న్యాయవాదులు అంకితభావంతో ముందుకెళ్లాలి

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గవాయి



కోర్టు భవన సముదాయం ప్రారంభోత్సవంలో న్యాయమూర్తులు

చిత్తూరు లీగల్, ఏప్రిల్ 27: చిత్తూరు న్యాయ వ్యవస్థకు మారుపేరని, ప్రజలకు దానిపై నమ్మకం కలిగేలా న్యాయవాదులు అంకితభావంతో ముందుకెళ్లాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గవాయి అన్నారు. చిత్తూరులో రూ.40 కోట్లతో నిర్మించిన 15 కోర్టు భవనాల సముదాయాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ జిల్లా నుంచి ఎంతో మంది విశిష్టమైన వ్యక్తులు న్యాయ వ్యవస్థకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. న్యాయవాదులు నిజాయితీ, ధైర్యం, అంకితభావంతో కష్టపడి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. జస్టిస్ ఎస్వీఎస్ భట్టి మాట్లాడుతూ న్యాయవ్యవస్థ ప్రతిష్ఠ పెంచేలా న్యాయవాదులు పనిచేయాలన్నారు. హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాగూర్ మాట్లాడుతూ కోర్టు భవనాల ప్రారంభోత్సవానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తులు రావడం ఆనందంగా ఉందన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు న్యాయమూర్తులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అంతకు ముందు కలెక్టర్ షన్మోహన్, ఎస్పీ మణికంఠ చందోలు, చిత్తూరు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో వారికి ఘనంగా స్వాగతం పలికారు. శాలువలు, గజమాలలు, పోలీసు గౌరవ వందనాలతో సన్మానించారు. హైకోర్టు న్యాయమూర్తి, చిత్తూరు అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ రావు రఘునందరావు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి తిరుపతి డివిజన్ విజయసారథిరాజు, చిత్తూరు, తిరుపతి, నగరి, మదనపల్లె, పుంగనూరు కోర్టుల న్యాయమూర్తులు, ఏపీ బార్‌కౌన్సిల్ ఛైర్మన్ నల్లారి ద్వారకనాథ రెడ్డి, చిత్తూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేంద్రరెడ్డి పాల్గొన్నారు.

తిరుపతి

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు



మధురకవి జీయర్‌స్వామికి తిరుమలలో పెద్దమర్యాద - దుర్గా స్టాలిన్

తిరుమల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని నాంగునేరి ప్రాంతంలోని వానమామలై మఠాధిపతి మధురకవి జీయర్‌స్వామి శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో ముందున్న అఖిలాండం వద్దకు చేరుకున్న జీయర్‌స్వామికి ఆలయ అర్చకబృందం, ఈవో ధర్మారెడ్డి ఇస్తికఫాల్(పెద్దమర్యాద)తో స్వాగతం పలికారు. ఆలయం నుంచి పల్లకిలో తీసుకువచ్చి శఠగోపం సమర్పించిన అనంతరం జీయర్‌స్వామి తన శిష్యబృందంతో కలిసి మహాద్వారం నుంచి ఆలయంలోకి వెళ్లారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అలాగే తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ సతీమణి దుర్గా స్టాలిన్ శనివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆమెకు వేదపండితులు ఆశీర్వచనం చేయగా, సిబ్బంది లడ్డూప్రసాదాలు అందజేశారు. అంతకుముందు తెలంగాణ ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి కూడా శ్రీవారి సేవలో పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ టోర్నీకి ఎస్వీయూ జట్టు ఎంపిక



తిరుపతి(క్రీడలు), ఏప్రిల్ 27: కేరళ రాష్ట్రం కొట్టాయంలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో వచ్చేనెల రెండో తేదీన జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ హ్యాండ్‌బాల్ టోర్నమెంట్‌కు ఎస్వీయూ జట్టును ఎంపికచేశారు. ఈ మేరకు వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎం.శివశంకర్‌రెడ్డి శనివారం వ్యాయామ విభాగం భవనం వద్ద క్రీడాకారులకు జెర్సీలు అందజేశారు ముఖ్య అతిథిగా ఒంగోలు ఆంధ్రకేసరి వర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఐ.దేవివరప్రసాద్ హాజరయ్యారు.

ఎంపికైన క్రీడాకారులు: బాలాజీనాయర్, ఎ.ఆకాశ్, బి.వెంకటబాలాజి, ఎస్.పృథ్వీరాజ్, కె.పవన్‌కల్యాణ్, ఆర్.రాముడు, డి.బాలఏసురెడ్డి, జి.నవీన్, సి.చైతన్య, పి.సుకేశ్, డి.లోకేశ్, పి.అరుణ్‌కుమార్, జి.ప్రకాశ్, కె.కార్తీక్ ఉన్నారు.

'మెకానికల్'లో నూతన ఆవిష్కరణలు జరగాలి



సదస్సులో పాల్గొన్న మద్రాసు ఐఐటీ ప్రొఫెసర్ సోమశేఖర్ ఎస్. హీరేమత్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 27: మెకానికల్ ఇంజనీరింగ్ రంగంలో నూతన ఆవిష్కరణలు జరగాలని మద్రాసు ఐఐటీ ప్రొఫెసర్ సోమశేఖర్ ఎస్ హీరేమత్ సూచించారు. ఎమర్జింగ్ ట్రెండ్స్ అండ్ చాలెంజెస్ ఇన్ ఫ్లూయిడ్ పవర్ సిస్టమ్స్ అంశంపై ఎస్వీయూలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం చేపట్టిన శనివారం ఒక్క రోజు సదస్సుకు సోమశేఖర్ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. తిరుపతి ఐఐటీ ప్రొఫెసర్ రవిశంకర్ మాట్లాడుతూ.. ఐఐటీలతో అవగాహన ఒప్పందాలు చేసుకుంటే జ్ఞాన మార్పిడికి అవకాశం కలుగుతుందన్నారు. డీఆర్‌డీవో శాస్త్రవేత్త కరుణానిధి మాట్లాడుతూ.. సామాజిక ప్రయోజనంతో కూడిన పరిశోధనలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ, సదస్సు కన్వీనర్ అరుణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవిలో కూలీలు జాగ్రత్తలు పాటించాలి: డీసీఎల్

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 27: జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరిగి వడగాల్పులు వీస్తున్నాయని, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కూలీలు జాగ్రత్తలు పాటించాలని డీసీఎల్ (డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్) బాలునాయక్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. కాంట్రాక్టర్లు, యజమానులు కూడా కూలీలకు అవసరమైన వసతులు కల్పించాలని కోరారు. నీడపాటున పనులు చేయించాలని, మధ్యాహ్నం సమయంలో పని చేయించొద్దని కోరారు. కూలీలు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ మేరకు కలెక్టర్ కూడా ఆదేశించారని పేర్కొన్నారు.

వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహించొద్దు: ఏఐడీఎస్‌వో

తిరుపతి(విద్య), ఏప్రిల్ 27: వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహించొద్దని ఆలిండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్‌వో) నగరాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య అన్నారు. నగరంలోని పలు ప్రైవేటు విద్యాసంస్థలు తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. శుక్రవారం న్యూబాలాజీ కాలనీలోని ఓ పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారని తెలిసి ఏఐడీఎస్‌వో నాయకులు శనివారం మధ్యాహ్నం అక్కడికి చేరుకున్నారు. విద్యార్థులను ఇళ్లకు పంపించకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. దీంతో వారు విద్యార్థులను ఇళ్లకు పంపేశారు.

జగన్ రెడ్డీ.. మీ నవమోసాలు ఇకచాలు!

- ఆరణి శ్రీనివాసులు, సుగుణమ్మ ధ్వజం



మీడియాకు వివరాలు తెలియజేస్తున్న ఆరణి, సుగుణమ్మ తదితరులు

తిరుపతి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): 'జగన్ రెడ్డీ.. నవరత్నాల పేరుతో మీ నవమోసాలు ఇక చాలు.. ఒక్క చాన్స్ ఇచ్చిన పాపానికి రాష్ట్రాన్ని 30 ఏళ్ల వెనక్కి నెట్టేశారు' అని టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, ఎన్డీయే కూటమి తరఫున పోటీలో ఉన్న జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ధ్వజమెత్తారు. శనివారం సుగుణమ్మ నివాసంలో కూటమి నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. అరాచక పాలన అంతం.. కూటమి పంతం అనే నినాదంతో ముందుకు పోతున్నామని, తమ విజయాన్ని వైసీపీ మూకలు ఆపలేరన్నారు. ఒక్క చాన్స్ అనే పదం ప్రజలకు వందేళ్ల తర్వాత కూడా మరచిపోలేని అతి పెద్ద ప్రతికూల అనుభవం మిగిల్చిందన్నారు. జగన్ రెడ్డి నోట మరో చాన్స్ అనే మాట వింటుంటే ప్రజల వెన్నులో వణుకు పుడుతోందని చెప్పారు. గత ఎన్నికల్లో జగన్ అలవికాని హామీలిచ్చి.. అధికారంలోకి వచ్చాక అవినీతి, అరాచకం, విధ్వంసం, కబ్జాలు, దోపిడీలతో ప్రజల జీవితాలను భ్రష్టుపట్టించారన్నారు. విషపూరిత మద్యంపోసి 35 లక్షల మంది పేదల్ని జబ్బులపాలు చేసి, 30వేల మంది ప్రాణాలు తీశాడని ఆరోపించారు. అన్న క్యాంటీన్లు, పండుగ కానుకలు, చంద్రన్న బీమా, నిరుద్యోగ భృతి, రైతు రుణమాఫీ, విదేశీ విద్య, ఆదరణ వంటి వందకి పైగా టీడీపీ అమలు చేసిన సంక్షేమ పథకాలను రద్దు చేశాడన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సబ్ ప్లాన్ నిధులు లక్ష కోట్లు దారి మళ్లించాడని, నవరత్నాలు నవమోసాలయ్యాయని దుయ్యబట్టారు. గతంలో ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కి మడమ తిప్పాడన్నారు. ఈసమావేశంలో నాయకులు మబ్బు దేవనారాయణ రెడ్డి, దంపూరి భాస్కర్ యాదవ్, నాగిడి విజయలక్ష్మి, సూరా సుధాకర్ రెడ్డి, కోడూరు బాలసుబ్రహ్మణ్యం, చినబాబు, కిరణ్ రాయల్, కొట్టే హేమంత్ రాయల్, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

రుయాలో ఒకే రాత్రి 11 సెల్‌ఫోన్ల చోరీ



చిన్నపిల్లల వార్డులో ఫోన్ చోరీ చేసి.. ఉడాయిస్తున్న దొంగ

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 27: రుయాలో ఒకే రాత్రి 11 సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి దాటాక జరిగింది. వైద్యం కోసం వచ్చే నిరుపేదలనే లక్ష్యంగా చేసుకుని ఆస్పత్రిలో కొంతకాలంగా రాత్రీపగలు తేడా లేకుండా రోగులు, వారి సహాయకుల ఫోన్లు చోరీకి గురవుతున్నాయి. ఈ క్రమంలోనే ఒకేరాత్రిలో పలు వార్డుల్లో 11 ఫోన్లు చోరీకి గురైనట్లు రోగులు, వారి సహాయకులు ఫిర్యాదు చేయడంతో అధికారులు, సిబ్బంది విస్తుపోయారు. వార్డుల్లో సీసీ కెమెరాలున్నా దొంగలు దర్జాగా ఆస్పత్రిలోని వార్డుల్లోకి ప్రవేశించి రోగుల సహాయకుల్లా వారి పక్కనే పడకలను సిద్ధం చేసుకుని సెల్‌ఫోన్లు, విలువైన వస్తువులను అపహరించుకెళుతున్నారు. వారం రోజులుగా రాత్రిళ్ల అధిక సంఖ్యలో ఫోన్లు చోరీకి గురవడంతో సెక్యూరిటీ సిబ్బంది ప్రత్యేక బృందాలుగా గస్తీ నిర్వహిస్తున్నారు. అయినా చోరీలు ఆగడం లేదు. దీనిపై అవుట్ పోస్టులోని సిబ్బంది బాధితుల నుంచి కనీసం ఫిర్యాదు కూడా స్వీకరించకపోవడంతో పోలీసుస్టేషన్ వరకు ఫిర్యాదులు వెళ్లడం లేదన్న విమర్శలున్నాయి. ఈ చోరీలకు అడ్డుకట్ట వేసేలా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

16నుంచి గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలు

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 27: తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయంలో మే 16 నుంచి 24వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు టీటీడీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. మే 15న అంకురార్పణ, 16న ధ్వజారోహణం, 17న చిన్న శేష, హంస వాహనాలు, 18న సింహ, ముత్యపుపందిరి వాహనాలు, 19న కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలు, 20న మోహినీ అవతారం, గరుడ సేవ, 21న హనుమంత, గజవాహనసేవ, 22న సూర్యప్రభ, చంద్రప్రభ, 23న రథోత్సవం, అశ్వవాహనసేవ, 24వ తేదీన చక్రస్నానం, ధ్వజావరోహణం ఉంటుంది. ఈ సందర్భంగా టీటీడీకి చెందిన అన్నమాచార్య ప్రాజెక్టు, దాససాహిత్య ప్రాజెక్టు, హిందూ ధర్మప్రచార పరిషత్ కళాకారుల ఆధ్వర్యంలో ఆలయంలో రోజూ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు టీడీపీ ఆ ప్రకటనలో పేర్కొంది.

మద్యం అక్రమ రవాణా, అమ్మకాలపై నిఘా పెట్టాలి: కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 27: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యం అక్రమ రవాణా, నిల్వ, అమ్మకాల ఉల్లంఘనలు జరగకుండా కఠినంగా వ్యవహరించాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులను కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని డిస్టలరీ, ఔట్‌లెట్‌లలో సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండాలని, అక్కడినుంచి వెళ్లే మద్యం రవాణా వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా ఎక్సైజ్ అధికారి జానకిరాములు మాట్లాడుతూ 24 వాహనాల ద్వారా రవాణా చేస్తున్నామని, వాటికి జీపీఎస్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మద్యం అక్రమ నిల్వలు, అమ్మకాల ఉల్లంఘనపై 91771 19097 జిల్లా ఎక్సైజ్ కంట్రోల్ రూం నెంబర్లకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌బ్యూరో అధికారి రాజేంద్ర మాట్లాడుతూ మార్చి 16నుంచి ఏప్రిల్ 26వ తేదీ వరకు 349 కేసులు నమోదు చేసి, 20 వాహనాలు సీజ్ చేశామని, సీజ్ చేసిన మద్యం విలువ రూ.29.86 లక్షలు ఉందని తెలిపారు. అదనపు ఎస్పీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీప్రియను అభినందిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు

టెన్త్ టాపర్‌కు కలెక్టర్ అభినందనలు

పదో తరగతి పరీక్షల్లో జిల్లాలోనే అత్యధిక మార్కులు సాధించిన శ్రీకాళహస్తి మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని కె.లక్ష్మీప్రియను కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ శనివారం సన్మానించి, అభినందించారు. ఇదే స్ఫూర్తితో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఈవో శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లు, చెక్‌పోస్టుల తనిఖీ



ఎంసీఎంసీలో సూచనలిస్తున్న ఉజ్వల్‌కుమార్ ఘోష్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 27: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నగరంలోని పలు పోలింగ్ బూత్‌లు, చెక్‌పోస్టులను తిరుపతి పార్లమెంటు సాధారణ పరిశీలకుడు ఉజ్వల్‌కుమార్ ఘోష్ తనిఖీ చేశారు. శనివారం తిరుపతి పరిధిలోని ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాల, ఎస్వీ క్యాంపస్ స్కూల్, నారాయణపురం, కొర్లగుంట, తిరుమల పోలింగ్‌స్టేషన్లను పరిశీలించారు. అలాగే నారాయణాద్రి ఆస్పత్రి, విద్యానగర్, తిమ్మినాయుడుపాళెం వద్ద ఉన్న చెక్‌పోస్టులను పరిశీలించారు. అంతకుముందు కలెక్టరేట్‌లో ఎంసీఎంసీ సెంటర్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి పార్లమెంటు పరిధిలో ఎన్నికల నియమావళి అతిక్రమిస్తే తనకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. కలెక్టరేట్‌లోని జేసీ కోర్టు హాల్‌లో రోజూ మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అందుబాటులో ఉంటానని తెలిపారు. నేరుగా కలవలేని వారు సెల్ నెంబర్ 75699 09928 ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు.

ఆరణి గెలుపునకు కృషి

జనసేన తిరుపతి అసెంబ్లీ ఇన్‌చార్జి కిరణ్‌రాయల్



యాదవ కాలనీలో కిరణ్‌ని ఆప్యాయంగా పలుకరిస్తున్న వృద్ధురాలు

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 27: కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు గెలుపునకు కృషి చేస్తున్నట్లు జనసేన అసెంబ్లీ ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ తెలిపారు. శనివారం ఉదయం నగరంలోని 16, 17 డివిజన్లలో తన మిత్రులు, పార్టీ కార్యకర్తలతో కలసి వీధి వీధి తిరుగుతూ గాజు గ్లాసు గుర్తుపై ఓటేసి, ఆరణిని గెలిపించాలని ఓటర్లను కోరారు. నెల తర్వాత తిరుపతిలో వైసీపీ నాయకులకు, రౌడీలకు స్వస్తి పలుకుతామంటూ ఓటర్లు, యువతలో ఉత్సాహం నింపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ల అబ్జర్వర్ అరుణ్, అధ్యక్షుడు షరీఫ్, నాయకులు మనోజ్, సంపత్, అనిత, హేమ, కార్యకర్తలు పాల్గొన్నారు.

అలరించిన నగర సంకీర్తన



తిరుపతి (కల్చరల్), ఏప్రిల్ 27: తిరుపతిలో శనివారం ఉదయం రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో జరిగిన నగర సంకీర్తన అలరించింది. ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు గోవిందరాజ స్వామి ఆలయ మాడవీధుల్లో నగర సంకీర్తన చేశారు. సంస్థ అధ్యక్షుడు గోపినాథరెడ్డి, మునిరత్నమాచారి, విక్రమ్, కన్నారెడ్డి, శాంబోలు హరనాథ్, తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యపై సదస్సు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 27: విదేశీవిద్య యువతకు ఉజ్వల భవిష్యత్తు ఇస్తుందని పలువురు వక్తలు సూచించారు. విదేశీ విద్యను ప్రోత్సహిస్తూ ఇండోకాన్ ఆధ్వర్యంలో శనివారం ఓ ప్రైవేటు హోటల్లో యువతకు, వారి తల్లిదండ్రులకు ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా సైకాలజిస్ట్ వనజ, అట్లాంటిస్ వరల్డ్ స్కూల్ డైరెక్టర్ కె.ఆర్.అనురాధగోపాల్, హైకోర్టు న్యాయవాది గోపాల్, డాక్టర్ ముక్కు తులసికుమార్ ప్రసంగించారు. ఇండోకాన్ సంస్థ సీఈవో జేమ్స్ కొరియాకోస్, జీహెచ్ సంస్థ హారిక, జ్ఞానేశ్వర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జననీరాజనాలతో ఆరణి ఉక్కిరిబిక్కిరి

వాడవాడలా కనిపించిన గాజు గ్లాసు గుర్తు



ఆరణి శ్రీనివాసులు, మబ్బు దేవనారాయణ రెడ్డి, ఊకా విజయకుమార్‌లకు కత్తి అందించిన కార్యకర్తలు

తిరుపతి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ, బీజేపీ, బలపరిచిన జనసేన అసెంబ్లీ అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుకు ఎన్నికల ప్రచారంలో అడుగడుగునా జననీరాజనాలు పలకడంతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. శనివారం ఉదయం టీడీపీ సీనియర్ నేత ఊకా విజయకుమార్ నేతృత్వంలో 28, 31, 30 డివిజన్లలోని కృష్ణాపురం ఠాణా, పీర్లచావడి, బెస్తవీధి, కోలావీధి, చింతకాయల వీధి, బొమ్మగుంట, నెహ్రూనగర్లో ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగింది. సాయంత్రం 36, 37 డివిజన్లలోని గిరిపురం, అనంతవీధి, టీనగర్, గాలివీధిలో క్లస్టర్ ఇన్‌చార్జి దంపూరి భాస్కర్ యాదవ్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం జరిగింది. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు సుగుణమ్మ, మబ్బు దేవనారాయణ రెడ్డి, నరసింహ యాదవ్, ఆర్సీ మునికృష్ణ, పులుగోరు మురళీకృష్ణారెడ్డి, చినబాబు, రుద్రకోటి సదాశివం, కొట్టే హేమంత్ రాయల్, డివిజన్ నాయకులు సుబ్బు యాదవ్, ఆముదాల తులసీరాం, శంకర్ యాదవ్, జిమ్ ప్రకాష్, మునికృష్ణ, శ్రీను, మధు, జాఫర్, ఖాదర్ బాషా, గోవిందాచారి, నాగరాజ, రేఖ, సుబ్బలక్ష్మి, మంజు, జనసేన నాయకులు డాక్టర్ హరిప్రసాద్, కిరణ్ రాయల్, రాజా రెడ్డి, సుభాషిణి, ఆర్కాట్ కృష్ణప్రసాద్, వినోద్‌రాయల్, కార్వేటి మధు, శేషు, బీజేపీ నాయకులు పొనగంటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా నాయకులను తెలుగు యువత అధికార ప్రతినిధి తోట వాసు, తోట హర్ష, తోట మధు, యువత మీడియా కో-ఆర్డినేటర్ శ్రీరాబ్ బాబి, జయకుమార్, ఆలీఖాన్, ప్రకాష్, పవన్, శేఖర్, కిరణ్ యాదవ్‌లు గజమాలతో సత్కరించారు.



కూటమి నేతలకు సత్కారం

అరాచక ప్రభుత్వానికి బుద్ధి చెప్పండి

తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద్



గూడూరు రోడ్డు షోలో బాలకృష్ణతో కలసి వరప్రసాద్ అభివాదం - తిరుపతి నగరంలో ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ స్ఫూర్తి

రాపూరు/గూడూరు, ఏప్రిల్ 27: జగన్ ప్రభుత్వ అరాచకం మితిమీరిపోయిందని ఆ ప్రభుత్వానికి ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు పిలుపునిచ్చారు. శనివారం రాపూరు, గూడూరులలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల్లో తనకు వస్తున్న ఆదరణను చూసి వైసీపీ భయపడుతోందన్నారు. తాను వైసీపీలో ఉన్నంత కాలం తనను ప్రజలనుంచి దూరం చేయాలని చూశారన్నారు. అలాగే ఎన్నో అవమానాలకు గురి చేశారన్నారు. తాను చేసిన అభివృద్ధే నేటికీ కనబడుతోందని తనను మరోసారి గెలిపిస్తే అన్ని విధాలా ప్రజలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

బాలకృష్ణ ర్యాలీలో... టీడీపీ నాయకుడు, సినీనటుడు నందమూరి బాలకృష్ణ గూడూరు, రాపూరులలో నిర్వహించిన ర్యాలీలు, బహిరంగ సభల్లో ఆయనతో కలసి తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు పాల్గొన్నారు. ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. బాలకృష్ణ తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావుతోపాటు గూడూరు, వెంకటగిరి టీడీపీ అభ్యర్థులు పాశం సునీల్‌కుమార్, కురుగొండ రామకృష్ణలతో కలసి ప్రజలకు పరిచయం చేయగా ప్రజల నుంచి భారీ స్పందన లభించింది. రెండు చోట్లా రోడ్‌షోలో బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కాగా వరప్రసాద్ కుమార్తె డాక్టర్ స్ఫూర్తి తన తండ్రి తరఫున తిరుపతి నగరంలో ప్రచారం నిర్వహించారు. తన తండ్రిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.81 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.3.81 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి శనివారం ప్రకటించింది. శుక్రవారం 57,909 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 32,403 మంది తలనీలాలు సమర్పించారు.

శ్రీరాముడి జీవితం ఆదర్శనీయం

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 27: శ్రీరాముడి జీవితం భావితరాలకు ఆదర్శనీయమని రాస్ డైరెక్టర్ వి.నాగరాజు, మానసిక నిపుణుడు చంద్రమౌళి అన్నారు. కొరమేనుగుంట రామాలయంలో శనివారం శ్రీరామనవమి వేడుకలను నిర్వహించారు. వృద్ధులకు చేతి కర్రలు, దుప్పట్లు పంపిణీచేశారు. కవిత, వాణి, నాగేశ్వర్, సత్యనారాయణ, నాగరాజు, గీతాంజలి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మిరియాల నారాయణ

రాజకీయాలు నీతిగా ఉండేవి

● మా రోజుల్లో...

నా వయసిపుడు 90 ఏళ్లు. మా నాయిన మిరియాల గోవిందయ్య స్వాతంత్ర్య సమరయోధుడు. ఓ దఫా జైలుకెళ్లాడు. నాయుడుపేట చావిడికి నెహ్రూ వస్తే ఆయనతో సమావేశం ఏర్పాటు చేశాడు. ఎన్టీరామారావు తెలుగుదేశం పార్టీ పెడితే నన్ను పెద్దలంతా నాయుడుపేట పట్టణ అధ్యక్షుడిగా చేశారు. 20 ఏళ్ల పాటు టీడీపీ పట్టణ అధ్యక్షుడుగా, పంచాయతీ బోర్డు మెంబరుగా, ఎంపీటీసీగా పనిచేశాను. అప్పట్లో ఎన్నికలకు డబ్బులిచ్చే వారు కారు. డబ్బుకు ఆశపడే నాయకులూ లేరు. ఓట్లు కొనడాలు లాంటివి మాకు తెలీదు. ఓట్లకోసం ఇంటింటికీ తిరిగేవాళ్లం కాదు. పార్టీ జెండా పట్టుకుని వీధుల్లో తిరిగేవాళ్లం. 10 మంది సైకిళ్లమీదో, బస్సుల్లోనో వెళ్లి నామినేషన్లు వేసేవాళ్లం. 20 యేళ్లుగా చూస్తున్నా.. రాజకీయాలు యాపారంగా మారిపొయినాయి. గందరగోళంగా, గొడవలుగా ఉన్నాయి.

- మిరియాల నారాయణ, నాయుడుపేట

-నాయుడు పేట



ఓటేయాలంటే 4.5 కి.మీ నడవాల్సిందే!

కోట మండలం కొత్తపట్నం పంచాయతీలో గోవిందపల్లిపాళెం సముద్రపు ఒడ్డున ఉంది. ఈ గ్రామంలో సుమారు 420 కుటుంబాలున్నాయి. 475 మంది ఓటర్లున్నారు. ఎలక్షన్లు వస్తే 4.5 కిలోమీటర్లు నడిచి గోవిందపల్లిలోని పోలింగ్ స్టేషన్‌లో ఓటువేసి వస్తుంటారు. తమ గ్రామంలో పోలింగ్ బూత్ పెట్టాలనే కోరిక నెరవేరడం లేదు. గ్రామానికి మధ్యలో ఉన్న బకింగ్‌హామ్ కెనాల్ కొన్నిసార్లు అటుపోట్లు ఎదురై కన్నెర్రచేస్తే వీరి కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఆ కెనాల్‌ను దాటుకొని అవతలి ఒడ్డుకు వచ్చి ఓటు వేయాల్సిందే. ఐదేళ్లకోసారి నాయకులు వచ్చి హామీ ఇవ్వడం, తర్వాత అమలు చేయకపోవడం తమకు అలవాటైపోయిందని ఇక్కడి మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

-కోట

ట్రెండ్ మారింది

గాడ్‌ఫాదర్లు పోయె!

సూళ్లూరుపేట రిజర్వుడు నియోజకవర్గంలో ఒకప్పుడు గాడ్‌ఫాదర్‌ల హవా నడిచేది. పార్టీ ఏదైనా స్థానిక భూస్వాముల మాటే నడిచేది. అట్లా రెండు కుటుంబాలు సూళ్లూరుపేట శాసనసభ్యులుగా ఎవరు ఉండాలో నిర్ణయించేవి. వారు చెప్పినవారికే టికెట్లు కేటాయించేవారు. 1960ల్లో కోట పోలూరుకి చెందిన బద్దెపూడి పేరారెడ్డి మాటే శాసనంగా నడిచేది. ఆయన చెప్పినవారికే కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయించేది. అయితే 1967లో పిట్ల వెంకటసుబ్బయ్య పేరును కాంగ్రెస్ అధిష్ఠానానికి పేరారెడ్డి సూచించారు. ఎందుకనో కాంగ్రెస్ అమోదించలేదు. పార్టీ అభ్యర్థిగా మేర్లపాక మునస్వామిని పోటీకి నిలిపింది. దీంతో తిరగబడ్డ బద్దెపూడి పేరారెడ్డి అదే పిట్ల వెంకటసుబ్బయ్య చేత ఇండిపెండెంట్‌గా నామినేషన్ దాఖలు చేయించారు. ఆ ఎన్నికల్లో అన్నీ తానై కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించి తన పంతం నెగ్గించుకున్నారు. ఖంగుతిన్న కాంగ్రెస్, ఆ తర్వాత పేరారెడ్డి దారిలోకి వచ్చింది. పిట్ల వెంకటసుబ్బయ్యను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంది. టీడీపీ ఆవిర్భావం తర్వాత సీను మారింది. వేనాటి కుటుంబం నిరయాత్మక పాత్ర పోషించింది. వేనాటి మునిరెడ్డి, ఆయన మరణం తర్వాత ఆయన సోదరుడు వేనాటి రామచంద్రారెడ్డిల మాటే టీడీపీ అధిష్ఠానం వినేది. వారు సూచించినవారికే టీడీపీ టికెట్ లభించేది. 2019 తర్వాత పరిస్థితి మారిపోయింది. గాడ్‌ఫాదర్‌ల మీద పార్టీలు ఆధారపడడం లేదు. ఒకరిద్దరు నాయకులు అటువంటి పాత్ర పోషించే ప్రయత్నాలు చేసినా పార్టీలు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వలేదు. సొంత సర్వేలు నిర్వహించుకుని దాని ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేసుకుంటున్నారు. గెలిచిన తర్వాత ఎమ్మెల్యేలుగా గెలిచినవారు కూడా గాడ్‌ఫాదర్‌ల చెప్పుచేతల్లో ఉండడానికి ఇష్టపడడం లేదు. స్వతంత్రంగా వ్యవహరించడంతో గాడ్‌ఫాదర్‌లకు ఆగ్రహం కలిగినా ఏమీ చేయలేని అసహాయతలో పడిపోయారు. ఈ పరిణామాలు గాడ్‌ఫాదర్‌లను కనుమరుగు చేసేశాయి.

- తడ




మూలిగే నక్కపై తాటి కాయ పడ్డట్లు ఉంది వైసీపీ వర్గాల పరిస్థితి. ఇప్పటికే ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉండగా, శనివారం సీఎం జగన్ విడుదల చేసిన మేనిఫెస్టో మరింత నిరాశ పర్చింది. టీడీపీ అధినేత చంద్రబాబు కొన్ని నెలల కిందట ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో పోల్చుకుని వైసీపీ వర్గాలే పెదవి విరుస్తున్నాయి. సంక్షేమ పథకాల లబ్ధి జగన్ కన్నా చంద్రబాబు అధికారంలోకి వస్తేనే ఎక్కువగా ఉంటుందన్న అభిప్రాయం ఏర్పడుతోంది. గత ఐదేళ్ల కన్నా అధికంగా ప్రయోజనం ఉంటుందని పెన్షనర్లు, రైతులు, మహిళలు ఆశపడ్డారు. జగన్ వారి ఆశలు భగ్నం చేశారు. జగన్ మేనిఫెస్టోను టీడీపీ మేనిఫెస్టోతో పోల్చి చూస్తే.. చంద్రబాబు అధికారంలోకి వస్తే జిల్లాలో సంక్షేమ పథకాల లబ్ధిదారులకు ఐదేళ్లలో రూ.4 వేల కోట్లకు పైగా లబ్ధి చేకూరనుంది. వైసీపీ ఎన్నికల మేనిఫెస్టో, టీడీపీ సూపర్ సిక్స్ పథకాలతో జిల్లా ప్రజలకు కలిగే లాభనష్టాల వివరాలిలా ఉన్నాయి. - తిరుపతి, ఆంధ్రజ్యోతి

తుస్సు్!

ఆందోళనలో వైసీపీ వర్గాలు

జగన్ మేనిఫెస్టో



● టీడీపీ గెలిస్తే రూ.4 వేల కోట్లకు పైగా అదనపు సంక్షేమం

జగన్ కన్నా చంద్రబాబు వస్తేనే మేలంటూ లెక్కలు వేసుకుంటున్న జనం

పెన్షన్లు

చంద్రబాబు హామీ: అధికారంలోకి రాగానే అన్ని వర్గాలకూ పెన్షన్ రూ. 4000లు చేస్తాం. ప్రస్తుతం రూ. 3000లు పెన్షన్ పొందుతున్నవారికి ఏప్రిల్ నుంచే పెంచిన రూ. 1000లు కూడా చెల్లిస్తాం.


జగన్ మేనిఫెస్టో: పెన్షన్‌లు 2028లో రూ. 250లు, 2029లో మరో రూ. 250లు పెంచుతాం.

జగన్ వల్ల రూ.1628 కోట్ల నష్టం



చంద్రబాబు ఇస్తానన్న నాలుగువేల పెన్షన్‌తో పోలిస్తే జగన్ అధికారంలోకి వస్తే జిల్లాలోని 2,71,477 మంది పెన్షన్‌దారులు నెలకు రూ.వెయ్యి చొప్పున రూ. 27.41 కోట్లు నష్టపోనున్నారు. అదే ఏడాదిలో అయితే రూ. 325.77 కోట్లు.. ఐదేళ్లకు ఏకంగా రూ. 1628.86 కోట్ల అదనపు లబ్ధిని పోగొట్టుకోనున్నారు. వ్యక్తిగతంగా చూస్తే ఒక్కో పెన్షనర్ ఏడాదికి రూ. 12 వేలు, ఐదేళ్లలో రూ. 60 వేలు చొప్పున నష్టపోనున్నారు.

గతంలో : జగన్ అధికారంలోకి వచ్చేప్పటికి పెన్షన్ రూ.2000 ఉంది. అంతకుముందు టీడీపీ అధికారం చేపట్టినపుడు కేవలం రూ. 200 మాత్రమే ఉండేది. దానిని చంద్రబాబు రూ. 2000లకు పెంచారు. జగన్, అధికారంలోకి వచ్చాక అవ్వాతాతలకు రూ.3000 చేస్తానని చెప్పి అంచలంచెలుగా రూ. 250 వంతున పెంచి రూ. 3000 చేశారు.



సిలిండర్లు

చంద్రబాబు హామీ: టీడీపీ అధికారంలోకి వస్తే ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లను ప్రతి ఇంటికీ ఉచితంగా ఇస్తాం.

జగన్ మేనిఫెస్టో: ఉచితంగా సిలిండర్లు ఇచ్చే ఆలోచనే లేదు.



టీడీపీ వస్తే గ్యాస్ రూపేణా రూ.883.59 కోట్ల లబ్ధి

జిల్లాలో తెల్ల రేషన్ కార్డు కలిగిన 5.89 లక్షల వంట గ్యాస్ వినియోగించే కుటుంబాలున్నాయి. ఈ ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తే వీరికి ఏడాదికి రూ.176.71 కోట్లు.. ఐదేళ్లలో రూ.883.59 కోట్ల లబ్ధి చేకూరనుంది. వ్యక్తిగతంగా ఒక్కో కుటుంబం ఏడాదికి రూ.3 వేలు, ఐదేళ్లలో రూ.15 వేలు ప్రయోజనం పొందనుంది. వైసీపీ అధికారంలోకి వస్తే ఈ మొత్తాన్ని నష్టపోవాల్సిందే.

రైతులకు

చంద్రబాబు హామీ: అధికారంలోకి రాగానే అన్నదాత పథకం కింద ఒక్కొక్కరికీ రూ. 20 వేలు వంతున ఇస్తాం.

జగన్ మేనిఫెస్టో: రైతు భరోసాను రూ. 16 వేలుకి పెంచుతాం.

361కోట్ల నష్టం

జిల్లాలో 1,80,654 మంది రైతులున్నారు. జగన్ తిరిగి సీఎం అయితే వీరు ఏడాదికి రూ.72.76 కోట్లు.. ఐదేళ్లలో రూ.361.30 కోట్లు కోల్పోనున్నారు. వ్యక్తిగతంగా లెక్కిస్తే ప్రతి రైతూ ఏడాదికి రూ.4 వేలు, ఐదేళ్లలో రూ. 20 వేలు వంతున నష్టపోనున్నారు. ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గెలిచి చంద్రబాబు సీఎం అయితే అదే మొత్తం రైతులకు అదనపు లబ్ధికానుంది. **గతంలో:** రైతులకు రూ.14 వేలు ఇస్తానని గతంలో చెప్పిన జగన్.. రూ.13500 ఇస్తున్నారు. అందులో రూ.6 వేలు కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం కిసాన్ యోజన నిధులే. అంటే జగన్ ఇచ్చేది రూ.7500 మాత్రమే.





ఆర్టీసీలో ఉచితం

చంద్రబాబు హామీ: అధికారంలోకి రాగానే ప్రతి మహిళకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం

జగన్ మేనిఫెస్టో: ప్రస్తావనే లేదు

టీడీపీ వస్తేనే మహిళలకు బస్సుల్లో ఉచితం

జిల్లాలో సుమారు 11 లక్షల మంది మహిళలున్నారు. వీరిలో ఉద్యోగ, ఉపాధి వంటి ఇతర పనుల కోసం నిత్యం ప్రయాణించేవారు లక్ష మంది ఉంటారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణమంటూ సూపర్‌సిక్స్ పథకాల్లో ప్రకటించేసింది. వైసీపీ ఈ విషయాన్ని పట్టించుకోలేదు. ఇప్పటికే కర్ణాటక, తమిళనాడు తాజాగా తెలంగాణ రాష్ట్రాల్లో ఈ ఉచిత ప్రయాణ పథకం విజయవంతంగా అమలవుతోంది.

చదువుకు భరోసా

చంద్రబాబు హామీ: టీడీపీ అధికారంలోకి వస్తే అమ్మకు వందనం పేరుతో ఇంట్లో ఎందరు పిల్లలున్నా ప్రతి పిల్లాడికీ రూ.15 వేలు చొప్పున అందిస్తాం.

జగన్ మేనిఫెస్టో: అమ్మఒడిని రూ.17లు వేలకు పెంచుతాం.

చంద్రబాబు గెలిస్తే రూ.1296 కోట్ల లాభం

ఈ ఎన్నికల్లో చంద్రబాబు అధికారంలోకి వస్తే తల్లులకు సుమారు రూ.1296 కోట్ల మేరకు ప్రయోజనం కలగనుంది. ఇంట్లో అందరు పిల్లలకు అమ్మఒడి కింద రూ.15 వేలు ఇస్తామని ఎన్నికల ముందు చెప్పిన జగన్.. ఆ తర్వాత ఒకరికే పరిమితం చేశారు. రూ.15 వేలలోనూ నిర్వహణ ఖర్చులంటూ కత్తిరించి రూ.13 వేలే ఖాతాల్లో వేస్తున్నారు. అదీ మధ్యలో ఒక సంవత్సరం ఎగ్గొట్టి.. నాలుగేళ్లే చెల్లించారు. ఇప్పుడు ఆ మొత్తాన్ని రూ.17 వేలు చేస్తామని చెబుతున్నా అధికారంలోకి వచ్చాక అంతే ఇస్తారన్న నమ్మకం జనంలో లేదు. ఒకవేళ ఇచ్చినా ఆ మొత్తం కత్తిరింపులు పోనూ ఖాతాలో జమయ్యేది రూ. 15 వేలే కావచ్చు. కానీ చంద్రబాబు ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ రూ.15 వేలు చొప్పున ఇస్తామని మాటిచ్చారు. సగటున ఇద్దరు పిల్లలు ఉంటున్న నేపథ్యంలో ప్రతి కుటుంబానికి రూ.15 వేలు అదనపు లబ్ధి కలగనుంది. ఈ రకంగా చూస్తే జిల్లాలో సుమారుగా 1.72 లక్షల మంది తల్లులు ఇప్పుడు అమ్మఒడి పొందుతున్నారు. ఇదే సంఖ్యను తీసుకున్నా వీరికి ఏటా రూ.259 కోట్లు.. ఐదేళ్లలో ఏకంగా రూ.1296 కోట్ల లబ్ధి కలగనుంది. వ్యక్తిగతంగా లెక్కిస్తే ఒక్కో తల్లికి ఏటా రూ. 15 వేలు, ఐదేళ్లలో రూ. 75 వేలు ప్రయోజనం పొందనున్నారు. జగన్ గెలిస్తే ఈ మొత్తాన్ని నష్టపోవాల్సిందే.





ఎన్నికల ప్రచారంలో భాగంగా తిరుపతి నెహ్రూ నగర్‌లో శనివారం జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు సరదాగా కాస్సేపు ఇస్త్రీ చేశారిలా..

పోస్టల్ బ్యాలెట్ కోసం ఫెసిలిటేషన్ సెంటర్

ఇతర జిల్లాల్లో ఓటు హక్కు కలిగి ఈ జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు తిరుపతిలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే సౌకర్యం కల్పించనున్నారు. ఇందుకోసం ఫెసిలిటేషన్ సెంటర్ పెడుతున్నామని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తులను జిల్లాలు, నియోజకవర్గాల వారీగా విభజించి ఆదివారం వెలగపూడిలోని సీఈవో కార్యాలయానికి సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. భద్రత నడుమ ఉద్యోగుల బ్యాలెట్‌ను జిల్లాకు తీసుకురావాల్సి ఉంటుందని సంబంధిత అధికారులకు సూచించారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఇతర జిల్లాల ఉద్యోగులు మే 5, 6 తేదీల్లో బాలాజీ కాలనీలోని ఎస్వీయూ క్యాంపస్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో వినియోగించుకోవాలని కోరారు.

- తిరుపతి(కలెక్టరేట్)

ప్రచార శంఖారావం రావిళ్లవారిపల్లె

● ఎవరైనా ఇక్కడి నుంచే ఎన్నికల ప్రచారం

చంద్రగిరి నియోజకవర్గంలో ఏ పార్టీ నాయకుడైనా రావిళ్లవారిపల్లె నుంచే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించడం శుభసూచకంగా నమ్ముతున్నారు. ఆర్‌సీపురం మండలానికి రావిళ్లవారిపల్లె ఈశాన్యంలో ఉండడమే ఇందుకు కారణమట. పంచాయతీ ఎన్నికలు మినహా అన్ని ఎన్నికల ప్రచారాలనూ టీడీపీ, వైసీపీ నాయకులు రావిళ్లవారిపల్లె నుంచే ప్రచారం ప్రారంభించడం ఆనవాయితీగా మారింది. టీడీపీ ఆవిర్భావం తరువాత ముద్దుకృష్ణమ నాయుడు ఇక్కడినుంచే ప్రచారం ప్రారంభించేవారు. ఒకసారి మినహా ఐదుసార్లు ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈ ఆనవాయితీని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి కూడా కొనసాగించారు. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో పులివర్తి నాని తనయుడు వినీల్ తన తండ్రిపక్షాన, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తమ్ముడు హర్షిత్‌రెడ్డి కూడా నెల క్రితం రావిళ్లవారిపల్లె నుంచే ఎన్నికల ప్రచారం ప్రారంభించారు.

- రామచంద్రాపురం

సెంటిమెంట్



రావిళ్లవారిపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న పులివర్తి వినీల్(ఫైల్ ఫొటో)



'స్మార్ట్' క్యాంపెయిన్

అభ్యర్థులకిప్పుడు ఇల్లిల్లూ తిరగాల్సిన అవసరం కూడా ఉండడంలేదు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు సైతం జండా భుజాన మోసి అలసిపోనూ అవసరం లేదు. స్మార్ట్ క్యాంపెయిన్ ఊపందుకుంది. అయిదేళ్ల కిందటితో పోలిస్తే ప్రచార వ్యూహాల్లో సోషల్ మీడియా వినియోగం మూడింతలు పెరిగిపోయింది. ఫేస్ బుక్ లైవ్‌లు ఇప్పుడు ట్రెండ్‌గా మారాయి. ఓ మాదిరి స్మార్ట్ ఫోన్ చేతిలో ఉంటే చాలు.. ప్రచారం హోరెత్తించేస్తున్నారు. కుప్పంలో వైసీపీ రెబెల్‌గా నామినేషన్ వేసిన అధికార పార్టీ సర్పంచి భార్య నీలమ్మ అలియాస్ నీలావతి, ఇటీవల ఫేస్ బుక్‌లో లైవ్‌లోకి వచ్చేశారు. నియోజకవర్గంలో అయిదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అరాచకాలను ఎండగట్టారు. తనను గెలిపిస్తే పరిశ్రమలు తెచ్చేసి మహిళలు బెంగళూరు వలస వెళ్లకుండా చూస్తానని హామీ ఇచ్చేశారు. మళ్లీ ఈ ఫేస్ బుక్ లైవ్‌ను వాట్సాప్‌తోపాటు ఇతర సోషల్ మీడియాలో షేర్ చేయడంతో అవి వైరల్‌గా మారాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులు సైతం ఏదో ఓ సమయంలో వీలు చూసుకుని ఇలా ఫేస్‌బుక్ లైవ్ షోలు చేస్తున్నారు. లేదా తమ ఆలోచనలు, హామీలతో వీడియోలను చేసి సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తున్నారు. స్వతంత్ర అభ్యర్థులు సైతం 'స్మార్ట్'గా విపరీతమైన ప్రచారం కొట్టేస్తున్నారు. ఇక ప్రధాన పార్టీల వీరాభిమానులైతే ఫేస్‌బుక్, ఇన్స్టాగ్రామ్, వాట్సాప్.. ఇలా వారు తమ పార్టీ అభ్యర్థుల ప్రచారంకోసం సామాజిక మాధ్యమాలను వాడుతున్నారు. ఖర్చు తక్కువ.. ప్రచారం ఎక్కువగా జరిగే స్మార్ట్ క్యాంపెయిన్లతో అభ్యర్థులు దూసుకు పోతున్నారు.

- కుప్పం

వెలవెల పున్నమి

చామంతిపురం రిజర్వాయర్ ఏమైంది స్వామి?

● మూడేళ్లయినా ఊసే లేని వైనం

పూతలపట్టు మండలం చామంతిపురం వద్ద రూ.3 వేల కోట్లతో రిజర్వాయర్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలి. దీంతో చిత్తూరు నగరంతో పాటు పూతలపట్టు, జీడీనెల్లూరు నియోజకవర్గాల్లో ప్రజల దాహార్తి తీరుతుంది.

- 2020 అక్టోబరు 19న చిత్తూరు కలెక్టరేట్‌లో అధికారులతో డిప్యూటీ సీఎం నారాయణస్వామి సమావేశమై ఆదేశించారు.

పూతలపట్టు, ఐరాల మండలాల సరిహద్దులో ఈ చామంతిపురం రిజర్వాయర్‌ను 5 టీఎంసీల సామర్థ్యంతో రూ.3 వేల కోట్లతో నిర్మించాలనుకున్నా.. దీన్ని ప్రభుత్వం అస్సలు పట్టించుకోలేదు. అధికారులు ఎన్నిసార్లు ప్రతిపాదనలు పంపించినా ఫలితం లేదు. దీన్ని నిర్మించి అక్కడికి ఉమ్మడి కడప జిల్లాలోని గండికోట రిజర్వాయర్ నుంచి పైపులైన్ల ద్వారా కృష్ణా జలాలు తెస్తామని.. లేదంటే అడవిపల్లె రిజర్వాయర్ నుంచి వచ్చే నీళ్లతోనైనా నింపుతామన్నారు. వాస్తవానికి జిల్లాలో ఒక్కటీ పెద్ద రిజర్వాయర్ లేదు. ఒక జలాశయం అందుబాటులో ఉంటే నీటిని నిల్వ చేసుకుని, ఎద్దడి పరిస్థితులను ఎదుర్కోవచ్చు. మూడున్నరేళ్లు పూర్తవుతున్నా దీని నిర్మాణానికి సంబంధించి నయా పైసా నిధులు విడుదల కాలేదు. ప్రాథమికంగా సర్వే చేయడానికి రూ.10 కోట్లవుతుందని యంత్రాంగం నారాయణస్వామికి సూచించగా, రూ.5 కోట్లు విడుదల చేయిస్తామని భరోసా ఇచ్చారు. ఫలితం లేదు. రిజర్వాయర్ నుంచి ఒక టీఎంసీ నీటిని చిత్తూరు నగరానికి కేటాయించి.. మరో నాలుగు టీఎంసీలతో పూతలపట్టు, జీడీనెల్లూరు నియోజకవర్గ ప్రజల దాహార్తి తీర్చవచ్చు. అలాగే పూతలపట్టు, జీడీనెల్లూరు నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది.

- పూతలపట్టు



జన కేతనం




'గత ప్రభుత్వాలు పేదలకు ఇళ్లు నిర్మిస్తే.. నేను ఊళ్లనే నిర్మిస్తాను' అంటూ సీఎం జగన్ చెప్పారు. లబ్ధిదారుల కోసం ఊరికి దూరంగా.. కొన్ని చోట్ల కొండల్లో గుట్టల్లో లే అవుట్లు వేశారు. గ్రామాల్లో ఒకటిన్నర.. పట్టణల్లో సెంటు స్థలాలు ఇచ్చారు. ఇంటికేమో రూపాయి కూడా ఇవ్వలేదు. కేంద్ర నిధులే సరిపెట్టారు. లబ్ధిదారులపై ఒత్తిడి చేసి.. బలవంతంగా ఇళ్ల నిర్మాణం చేయించారు. దీంతో వారంతా అప్పులపాలయ్యారు. జగనేమో తాను ఊళ్లను కడుతున్నానంటూ 'జగనన్న కాలనీ'లుగా పేరు పెట్టుకున్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

పుంగనూరు చరిత్ర

జమీందారుల కోట



పుంగనూరు అంటే జమీందారులు గుర్తుకొస్తారు. ఒకనాడు పాలన సాగించిన రాజకీయ ఉద్దండులూ జ్ఞాపకానికి వస్తారు. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత నాటి ప్రశాంతత దూరమై.. రాజకీయ కక్షలు, అక్రమాలు, దౌర్జన్యాలతో రాష్ట్రవ్యాప్తంగా పేరు పొందింది. పూర్వపు పుంగనూరు నియోజకవర్గం.. పుంగనూరు, చౌడేపల్లె, సోమల, పెద్దపంజాణి, రామసముద్రం మండలాలతో, 35 కిలోమీటర్లలోపు విస్తీర్ణంతో ఉండేది. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత దీని విస్తీర్ణం 120 కిలోమీటర్లకు విస్తరించింది. తమిళం, కన్నడ ప్రజలూ ఇక్కడ స్థిరపడ్డారు. 1952లో మొదలై ఇప్పటికి 17 మార్లు ఎన్నికలు జరిగాయి. అందులో రెండు ఉప ఎన్నికలు ఉన్నాయి. కాంగ్రెస్‌పార్టీ 9 సార్లు, తెలుగుదేశం పార్టీ ఆరు పర్యాయాలు, వైసీపీ రెండు సార్లు, స్వతంత్ర్య అభ్యర్థి ఒకసారి గెలుపొందారు. 11 మంది ఎమ్మెల్యేలు అయ్యారు. తెలుగుదేశం ఆవిర్భావం తర్వాత జరిగిన ఎన్నికల్లో సామాన్యుడైన బస్సు కండక్టర్ బగ్గిడి గోపాల్ ఎమ్మెల్యేగా గెలుపొందడం గమనార్హం. 1955, 1970, 1972ల్లో ఎమ్మెల్యేలుగా జమిందారీ కుటుంబీకులు ఎన్నికయ్యారు. ఇక, ఎమ్మెల్యేగా, చిత్తూరు ఎంపీగా హ్యాట్రిక్ సాధించిన నూతనకాల్వ రామకృష్ణారెడ్డి రాజకీయ ప్రస్థానం ఈ నియోజకవర్గం నుంచే మొదలైంది. తండ్రీ కొడుకులుగా రామకృష్ణారెడ్డి, అమరనాథరెడ్డి ఈ నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహించారు. ఈ ఐదేళ్లలో అరాచకాలు, దౌర్జన్యాలు, పోలీసు కేసులు, రౌడీషీట్లు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రత్యర్థులను నామినేషన్లు వేయకుండా పోలీసుల సహకారంతో వైసీపీ శ్రేణులు అడ్డుకోవడం వంటి ఘటనలతో రాష్ట్రవ్యాప్తంగా పేరు పొందింది.

ఎమ్మెల్యేలు వీరే..

1952- బాదాల కృష్ణమూర్తి (కాంగ్రెస్)
1955- వైబీ.వీరబసవచిక్కరాయులు (స్వతంత్ర)
1955- ఎంఎం.రత్నం (కాంగ్రెస్)
1962, 1967-వి.రామస్వామిరెడ్డి (కాంగ్రెస్)
1970 ఉప ఎన్నిక- బి.రాణీసుందరమ్మణి (కాంగ్రెస్)
1972- బి.రాణీసుందరమ్మణి (కాంగ్రెస్)
1978- కేవీ పతి (కాంగ్రెస్-ఐ)
1983- బగ్గిడి గోపాల్ (టీడీపీ)
1985, 1989, 1994 - ఎన్.రామకృష్ణారెడ్డి (టీడీపీ)
1996 ఉప ఎన్నిక- ఎన్.అమరనాథరెడ్డి(టీడీపీ)
1999- ఎన్.శ్రీధర్‌రెడ్డి (కాంగ్రెస్)
2004- ఎన్.అమరనాథరెడ్డి (టీడీపీ)
2009- పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి (కాంగ్రెస్)
2014, 2019- పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి (వైసీపీ)

మండలాలు: పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల

ఓటర్ల సంఖ్య : 2,37,719
పురుషులు : 1,16,504
మహిళలు : 1,21,210
ఇతరులు : 05

- పుంగనూరు



ఊళ్లను నిర్మించడమంటే

ఇదేనా జగన్?

● కొండల్లో, గుట్టల్లో లేఅవుట్లు ● మౌలిక వసతుల కరువు
● ఇల్లుకట్టుకున్నా నివాసం ఉండలేక అవస్థలు
● కేంద్రం సొమ్ముతో రాష్ట్ర ప్రభుత్వం సోకులు





జిల్లాకు 73,584 పక్కా గృహాలు మంజూరయ్యాయి. వీటిలో 46,374 పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. మంజూరై నాలుగేళ్లవుతున్నా 3082 మంది లబ్ధిదారులు ఇంకా నిర్మాణాలను ప్రారంభించలేదు. 3560 మంది పునాది గుంతలు తవ్వి వదిలేయగా.. 10,948 మంది పునాదులు వేసుకున్నరు. 5,334 మంది గోడలు.. 4,286 మంది స్లాబులను వేసుకున్నారంతే. ఆసక్తి చూపకపోవడానికి కారణం యూనిట్ కాస్ట్ చాలకపోవడం. టీడీపీ హయాంలో కేంద్రం రూ.1.50 లక్షలు ఇస్తే.. రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష ఇచ్చేది. అప్పటి ధరలకు ఈ రూ.2.5 లక్షలకు అదనంగా మరో రూ.లక్ష వేసుకుంటే ఇల్లు సిద్ధమైపోయేది. ఇప్పుడు.. కరోనా తర్వాత నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిపోయాయి. ఊళ్లను కడతానన్న జగన్.. తమ ప్రభుత్వ వాటాగా పైసా కూడా ఇవ్వలేదు. కేంద్రం ఇంటికి ఇచ్చే రూ.1.5 లక్షలు, మరుగుదొడ్డికి అందించే రూ.30 వేల ఉపాధి నిధులనే తాను ఇస్తున్నట్లు కలరింగ్ చేస్తున్నారు. ఇప్పుడున్న ధరలతో ఇంటి నిర్మాణానికి కనీసం రూ.6 లక్షలు అవుతోంది. దీంతో పేదలు అప్పులు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. వడ్డీలు కట్టలేక సతమతమవుతున్నారు.

ఇక్కడ ఇళ్లు కట్టుకునేదెలా?



నగరి పట్టణంలోని పేదలకని ఏడు కిలోమీటర్ల దూరంలోని నాగరాజుకుప్పం, కీలపట్టుల్లో రెండు లేఅవుట్లు సిద్ధం చేశారు. కొండ ప్రాంతంలో ఉండడంతో చాలామంది నిర్మాణానికి చొరవ చూపలేదు. కేంద్రం ఇచ్చే రూ.1.8 లక్షలు కాకుండా, ఒక్కో లబ్ధిదారు వద్ద రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేశారు. వైసీపీకి చెందిన ఇద్దరు కాంట్రాక్టర్లతో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. మరుగుదొడ్లు, గోడలకు పూత పనులు, తలుపులు వంటివి అసంపూర్తిగా వదిలేశారు. ఇవన్నీ పూర్తి చేయాలంటే ఒకొక్కరు రూ.1.80 లక్షలు ఇవ్వాలని కాంట్రాక్టర్లు అడిగినట్లు ఓ మహిళ చెప్పారు. అంత ఇచ్చుకోలేక కొందరు వదిలేశారు. ఈ రెండు లేఅవుట్లలో 3556 ఇళ్ల మంజూరగా, 1978 పూర్తయ్యాయి. ఊరికి దూరంగా ఉండడంతో ఇక్కడ నివాసం ఉండేందుకు భయపడుతున్నారు.

నెరవేరని సొంతింటి కల

జిల్లాలో సుమారు 74 వేల మందికి ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. వీటిని ఆధార్‌తో అనుసంధానం చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కొండల్లో, గుట్టల్లో, ఊరికి దూరంగా ఇచ్చిన స్థలాల్లో ఇళ్లు కట్టుకోలేక.. కట్టుకున్నా నివాసం ఉండలేకున్నారు. ఎందుకంటే.. ఊరికి దూరంగా కాపురం వెళితే బతుకుతెరువు కోసం నిత్యం పట్టణానికి రావాలంటే వ్యయప్రయాసలు కాబట్టి. అందుకని అద్దె ఇళ్లల్లోనే ఉంటున్నారు. ఇళ్లు కట్టుకోకున్నా ప్రస్తుతం వీరు లబ్ధిదారులు కావడంతో.. భవిష్యత్తులో ప్రభుత్వాలు అనువైన చోట ఇళ్ల స్థలాలు ఇచ్చినా.. వీరు అనర్హలవుతారు. ఇలా సొంతింటి కల నెరవేరని పరిస్థితి. అందుని కొందరు లబ్ధిదారులు పనికిరాని పట్టాలు తమకొద్దని, రద్దు చేయాలని కోరుతున్నారు.






అప్పు చేసే స్థోమత లేక..

ఈమె పేరు మేరీ. బంగారుపాళ్యం మండలం ముంగరమడుగు గ్రామం. ఈమెకు పక్కా గృహం మంజూరైంది. తొలుత పునాది బిల్లు రూ.70 వేలు, తర్వాత గోడ బిల్లు రూ.35 వేలు, 50 బస్తాల సిమెంటు వచ్చాయి. అప్పు చేసి స్లాబు వేసుకున్నారు. ఆరు నెలలవుతున్నా బిల్లులు రాలేదు. ఇప్పటివరకు ఇటుకల కోసం రూ.లక్ష, మేస్త్రి కూలి కోసం రూ.1.10 లక్షలు ఖర్చయినట్లు ఆమె తెలిపారు. ఇంకా గోడలకు పూత పని, తలుపులు, కిటికీలు అమర్చలేదు. ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలు ఏమాత్రం చాలడం లేదని, మరో రూ.3 లక్షలు చేతి నుంచి పడుతోందని, స్థోమత లేక నిర్మాణం ఆపేసినట్లు ఆమె చెప్పారు.

ఊరికి దూరంగా.. మౌలిక వసతుల్లేక



ఇది వి.కోట మండలం పాపేపల్లి-3 జగనన్న లేఅవుట్. ఇక్కడ 400 మందికి ఇళ్లు మంజూరైతే 50 మంది నిర్మాణాలను పూర్తి చేసుకున్నారు. వీరిలో 30 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఈ లేఅవుట్ వి.కోటకు మూడు కిలోమీటర్ల దూరంగా.. మెయిన్ రోడ్డు నుంచి కిలో మీటరు లోపలకు ఉంది. దీంతో ఇక్కడ నివాసం ఉండేందుకు మహిళలు భయపడుతున్నారు. ఈ కాలనీలో అంతర్గత రహదారుల్ని నిర్మించలేదు. మౌలిక వసతులు కల్పించలేదు.

వడ్డీలు కట్టలేక..

ఈమె పేరు జయశ్రీ. పెనుమూరు మండలం చిన్నకలికిరి గ్రామం. ఈమెకు పక్కా గృహం మంజూరు కావడంతో రూ.2 లక్షలు అప్పుచేసి చకాచకా స్లాబు వరకు పనులు పూర్తి చేశారు. ప్రభుత్వం నుంచి రూ.70 వేలు పునాది బిల్లు కూడా వచ్చింది. ఆరు నెలలుగా గోడలు, మోల్డింగ్ బిల్లులు రాలేదు. సచివాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేదు. దీంతో ఇంటి తుది మెరుగులు దిద్దలేక, అప్పులకు వడ్డీలు కట్టలేక ఇబ్బంది పడుతున్నారు.





అసంపూర్తి ఇంట్లోనే నివాసం

ఈమె పేరు సల్మా. వి.కోట మండలంలోని పాపేపల్లి-3 జగనన్న లేఅవుట్‌లో ప్రభుత్వ గృహాన్ని నిర్మించుకున్నారు. రూ.1.80 లక్షల బిల్లు పూర్తిగా వచ్చేసింది. చేతి నుంచి రూ.3 లక్షలు వేసుకుని నిర్మాణం పూర్తి చేసుకున్నారు. మరో రూ.లక్ష ఉంటే తుది మెరుగులు చేసుకోవచ్చు. ఇక అప్పులు చేయలేక వదిలేశారు. ఆ అసంపూర్తిగా ఇంట్లోనే నివాసం ఉంటున్నారు. వి.కోటకు దూరంగా లేఅవుట్ ఉండడంతో రాత్రిళ్లు భయపడుతూ జీవనం సాగిస్తున్నారు.

కుప్పం వర్తమానం

'భువన' సారథ్యం!

నిన్నా మొన్నటిదాకా లో ప్రొఫైల్ మెయిన్‌టైన్ చేశారు. ఎప్పుడైతే తన భర్తను కేసుల్లో ఇరికించి జైలుపాలు చేశారో, అప్పుడు 'నిజం గెలవాలి' పేరుతో లైమ్‌లైట్‌లోకి వచ్చారు. రాష్ట్రమంతా పర్యటించి.. పార్టీ శ్రేణులకు నేనున్నానంటూ ధైర్యం చెప్పారు. ఎన్నికల వేళ చంద్రబాబు బిజీగా ఉండటంతో.. ఆయన తరపున కుప్పంలో పార్టీకి సారథ్యం వహిస్తున్నారు నారా భువనేశ్వరి. హైదరాబాదు నుంచి ఆమె పర్యవేక్షిస్తున్నారు.

- కుప్పం

గతేడాది చివర్లో ఎన్టీఆర్ ట్రస్టు తరఫున క్లినిక్ ప్రారంభోత్సవానికి నారా భువనేశ్వరి కుప్పం వచ్చారు. అప్పుడు రాజకీయాల గురించి అడిగితే వాటి గురించి తనకు తెలియదని చెప్పారు. అదే ఆమె.. 'నిజం గెలవాలి' యాత్రలో భాగంగా గత నెల 20, 21 తేదీలలో ఇక్కడ పర్యటించినప్పుడు రాజకీయాల గురించి మాట్లాడాల్సిన అనివార్య పరిస్థితి స్థానికంగానే కాకుండా, రాష్ట్రమంతటా ఏర్పడింది. చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక గుడుపల్లె మండలంలో ఇద్దరు అభిమానులు చనిపోయారు. ఆ కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ తరపున రూ.3 లక్షల చెక్కు అందించారు. బాధిత కుటుంబాల బిడ్డల బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. గుడుపల్లె, రామకుప్పం, శాంతిపురం మండలాల్లో అన్న క్యాంటీన్లను ప్రారంభించారు. మహిళలతో జరిగిన ముఖాముఖిలో పాల్గొన్నారు. వైసీపీ పాలనలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించి టీడీపీ అధికారంలోకి వచ్చాక పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ప్రస్తుతం ఎన్నికల నేపథ్యంలో టీడీపీ అధినేత చంద్రబాబు బిజీగా మారిపోయారు. నారా లోకేశ్ సైతం తీరికలేని పార్టీ కార్యక్రమాలలో తలమునకలయ్యారు. ఈ క్రమంలో చంద్రబాబు నియోజకవర్గ సారథ్య బాధ్యతలను క్రమేణా భువనేశ్వరి తీసుకుంటూ వచ్చారు. తాను నియోజకవర్గానికి దూరంగా ఉంటున్నా అక్కడి నుంచే పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయసాగారు. ఈనెల 19వ తేదీన చంద్రబాబు తరఫున నామినేషన్ వేయడానికి కుప్పం వచ్చారామె. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీకి జనం వేలాదిగా వచ్చారు. రెండు రోజులపాటు మహిళలు, ప్రతిభావంతులు, ముస్లిం మైనారిటీ సోదరులు.. ఇలా ప్రతివర్గంతోనూ ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించారు. వైసీపీ అరాచకాలపై నిప్పులు చెరిగారు. పార్టీ కేడర్‌పై అన్యాయంగా బనాయించిన అక్రమ కేసులను ప్రస్తావించారు. తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. టీడీపీ అధికారంలోకి వస్తే పార్టీలో కష్టపడిన ప్రతివొక్కరికీ గుర్తింపు ఉంటుందన్నారు. అత్యధిక మెజారిటీ సాధించే పోలింగ్‌బూత్ ఉన్న ప్రాంతాన్ని తాను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తానని చెప్పారు.

హైదరాబాదు నుంచే పర్యవేక్షణ

హైదరాబాదులో ఉంటున్నా.. కుప్పంలో పరిస్థితులను భువనేశ్వరి తెలుసుకుంటున్నారు. ఇటీవల తంబిగానిపల్లెలో వైసీపీ మూకల దాడిలో గాయపడిన పార్టీ కార్యకర్తలను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ద్వారా ఆమె ఫోనులో పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రతి మూడు నెలలకు ఓసారి కుప్పం వస్తానని అవసరమైతే బాధితుల తరపున న్యాయపోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. చంద్రబాబు రాష్ట్రమంతా చూసుకోవాల్సి రావడంవల్ల భువనేశ్వరి తన సమయాన్ని కుప్పంలో పార్టీకోసం కేటాయించారు. లక్ష మెజారిటీ లక్ష్యంగా శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్నారు.



ఈనెల 19న చంద్రబాబు తరపున నామినేషన్ వేసే సందర్భంగా ప్రజలకు అభివాదం చేస్తున్న భువనేశ్వరి (ఫైల్ ఫొటో)

మరోవైపు తన బిజీ షెడ్యూల్‌లో వెసులుబాటు తీసుకుని చంద్రబాబు కూడా ఇక్కడి కేడర్‌ను పలకరిస్తున్నారు. టెలికాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేస్తున్నారు. మొన్న రామకుప్పంలో పోలీసు అధికారి బాధితులను ఫోనులో పలకరించి ధైర్యం చెప్పారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

కుల రాజకీయాలు సిగ్గుచేటు: ఎస్సీవీ



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 27: కులాల పేరుతో వైసీపీ రాజకీయాలు చేయడం సిగ్గుచేటు అని మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని తన నివాసంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... మున్సిపల్ మాజీ ఛైర్మన్ ముత్యాల పార్థసారథి వైసీపీని వీడి టీడీపీలో చేరేందుకు ప్రయత్నించడంతో కొందరు వ్యతిరేకించిన మాట వాస్తవమన్నారు. అయితే కూటమి అభ్యర్థి సుధీర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్‌తో చర్చించి గెలుపే లక్ష్యంగా చంద్రబాబు సమక్షంలో ముత్యాల పార్థసారథిని తానే టీడీపీలోకి తీసుకువచ్చానని తెలిపారు. కులం పేరు ప్రస్తావిస్తూ ముత్యాల పార్థసారథిని అవమానించేలా వైసీపీ నాయకులు సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు చేయడం తగదన్నారు. పార్థసారథి మాట్లాడుతూ... ఇటీవల పట్టణంలోని వాటర్ హౌస్ కాలనీలో ప్రచారం జరుగుతున్న సందర్భంగా సుధీర్‌రెడ్డి స్వయంగా తనకు ఫోన్ చేసి అక్కడికి రావాల్సిందిగా కోరినట్లు చెప్పారు. అక్కడ బలిజలను అవమానించేలా సుధీర్ రెడ్డి మాట్లాడారని వైసీపీ దుష్ప్రచారం చేయడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. ఓట్ల కోసం నీచ రాజకీయాలు చేసే వైసీపీకి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నారాయణ యాదవ్, ప్రకాష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో ఇద్దరి మృతి





చెంగయ్య, కృష్ణయ్య (ఫైల్‌ఫొటోలు)

వరదయ్యపాళెం/పిచ్చాటూరు, ఏప్రిల్ 27: వరదయ్యపాళెం మండలంలోని సంతవేలూరుకు చెందిన తొట్టంబేడు చెంగయ్య గత సోమవారం ఉపాధి పనులకు వెళ్లాడు. ఎండ వేడిమికి భరించలేక స్పృహ తప్పిపడిపోయాడు. సూళ్లూరుపేట ప్రైవేటు ఆస్పత్రికి, అక్కడి నుంచి తిరుపతి రుయాకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. అలాగే పిచ్చాటూరు మండలంలో రామాపురం దళితవాడకు చెందిన కృష్ణయ్య(75) రెండు రోజుల క్రితం వడదెబ్బకు మృతి చెందాడు. వేలూరు నుంచి రామాపురం వెళ్లే నడకదారిలో కృష్ణయ్య మృతదేహాన్ని స్థానికులు శనివారం గుర్తించారు.

చంద్రన్నతోనే రాష్ట్రానికి వెలుగు: సుధీర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బొజ్జలసుధీర్‌రెడ్డి

తొట్టంబేడు, ఏప్రిల్ 27: అభివృద్ధి లేక అంధ కారంలో ఉన్న రాష్ట్రంలో చంద్రబాబు నాయుడే వెలుగులు నింపగలరని శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎన్డీఏ కూటమి అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని టీఎంవీ కండ్రిగ, చర్లోపల్లి, కాపుగున్నేరి, రాచగున్నేరి, చల్లపాళెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో అక్రమాలు, దౌర్జన్యాలు తప్ప నియోజకవర్గంలో ఒక్క అభివృద్ధి పనీ జరగలేదన్నారు. వైసీపీని ఇంటికి పంపి, టీడీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక వలంటీర్లను కొనసాగిస్తామని, వైసీపీ నాయకుల బెదిరింపులకు బయపడి రాజీనామాలు చెయ్యవద్దని సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకటసుబ్బారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు కామేష్‌యాదవ్, రంగినేని చంచయ్య నాయుడు, తాటిపర్తి ఈశ్వర్‌రెడ్డి, బొల్లినేని జగన్నాథం నాయుడు, పాపిరెడ్డి, మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి, బత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే యాదవుల అభ్యున్నతి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 27: టీడీపీతోనే యాదవుల అభ్యున్నతి సాధ్యమని తిరుపతి పార్లమెంటు యాదవ సంఘం ఉపాధ్యక్షుడు శివ యాదవ్ అన్నారు. శ్రీకాళహస్తి మండలం రామాపురం మాజీ సర్పంచు, టీడీపీ సీనియర్ నాయకుడు కూనాటి మల్లికార్జున యాదవ్ ఆధ్వర్యంలో కుంటిపూడి గ్రామానికి చెందిన మాజీ సర్పంచు శివ యాదవ్ శనివారం టీడీపీలో చేరారు. ఆయనకు ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. సుధీర్ రెడ్డిని శివ యాదవ్ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వైసీపీ బీసీలను దారుణంగా దగా చేసిందన్నారు. ప్రస్తుత రాష్ట్ర పరిస్థితి బాగుపడాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలన్న ఆశయంతో టీడీపీలో చేరానని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గజ్జి భాస్కర్ యాదవ్, చింత నాగేశ్వర రావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సుధీర్‌రెడ్డిని సత్కరిస్తున్న శివ యాదవ్

ఎన్డీఏ కూటమిని గెలిపించుకుందాం: టీడీపీ



ఆత్మీయ సమావేశంలో పలమాల సుధాకర్

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 27: త్వరలో జరిగే ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని టీడీపీ నాయకుడు, సీరియల్ నిర్మాత పలమాల సుధాకర్ పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఆయన స్వగృహంలో శనివారం బంధువులు, స్నేహితులు, సన్నిహితమైన ప్రముఖులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ... ప్రస్తుతం రాష్ట్ర పరిస్థితి దయనీయంగా ఉందని, భవిష్యత్తును కాపాడుకోవాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా బొజ్జల సుధీర్ రెడ్డి, తిరుపతి ఎంపీగా వరప్రసాద్‌ను గెలిపించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పలమల శశాంక్, పగడాల సుధాకర్, సిద్ధులు గారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అరాచక ప్రభుత్వానికి బుద్ధి చెప్పండి

తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద్



గూడూరు రోడ్డు షోలో బాలకృష్ణతో కలిసి ప్రజలకు అభివాదం చేస్తున్న వరప్రసాద్‌రావు

రాపూరు/గూడూరు, ఏప్రిల్ 27: జగన్ ప్రభుత్వ అరాచకం మితిమీరిపోయిందని ఆ ప్రభుత్వానికి ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు పిలుపునిచ్చారు. శనివారం రాపూరు, గూడూరులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల్లో తనకు వస్తున్న ఆదరణను చూసి వైసీపీ భయపడుతోందన్నారు. తాను వైసీపీలో ఉన్నంత కాలం తనను ప్రజలనుంచి దూరం చేయాలని చూశారన్నారు. అలాగే ఎన్నో అవమానాలకు గురి చేశారన్నారు. తాను చేసిన అభివృద్ధే నేటికీ కనబడుతోందని తనను మరోసారి గెలిపిస్తే అన్ని విధాలా ప్రజలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

బాలకృష్ణ ర్యాలీలో... టీడీపీ నాయకుడు, సినీనటుడు నందమూరి బాలకృష్ణ గూడూరు, రాపూరులలో నిర్వహించిన ర్యాలీలు, బహిరంగసభల్లో ఆయనతో కలసి తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు పాల్గొన్నారు. ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. బాలకృష్ణ తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్‌రావుతోపాటు గూడూరు, వెంకటగిరి టీడీపీ అభ్యర్థులు పాశం సునీల్ కుమార్, కురుగొండ రామకృష్ణలతో కలసి ప్రజలకు పరిచయం చేయగా ప్రజల నుంచి భారీ స్పందన లభించింది. రెండు చోట్లా రోడ్ షోలో బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కాగా వరప్రసాద్ కుమార్తె డాక్టర్ స్ఫూర్తి తన తండ్రి తరఫున తిరుపతి నగరంలో ప్రచారం నిర్వహించారు.



తిరుపతి నగరంలో ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ స్ఫూర్తి

శ్రీసిటీలో శ్రీవాణి ఉగాది పురస్కారాల ప్రదానం



పురస్కార గ్రహీతలతో శ్రీసిటీ ఎండీ

శ్రీసిటీ, ఏప్రిల్ 27: శ్రీసిటీలో ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం శనివారం వేడుకగా నిర్వహించారు. శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో స్థానిక బిజినెస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన నలుగురు ప్రముఖులకు ఉగాది పురస్కారాలను అందజేశారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి చేతుల మీదుగా శ్రీవాణి ప్రతిష్ఠాత్మక ఉగాది సంగీత పురస్కారాన్ని టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు ప్రసిద్ధ గాయకులు కె.సరస్వతీప్రసాద్, సాహిత్య పురస్కారాన్ని కవి, సాహితీవేత్త బుచ్చినాయుడు కండ్రిగకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు యువశ్రీ మురళి, ఆధ్యాత్మిక పురస్కారాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక వక్త, అన్నమయ్య, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబల ఆధ్యాత్మిక రచనల పరిశోధకులు గంధం బసవ శంకరరావు, పాత్రికేయ పురస్కారాన్ని తిరుపతికి చెందిన మాజీ హిందూ విలేకరి ఏ.దేవరాజన్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వరరావు, సీఐ భాస్కర్, సాహిత్య ప్రియులు పాల్గొన్నారు.

మార్కెట్ రుసుం వసూలు మరో నెల పొడిగింపు!

రేణిగుంట, ఏప్రిల్ 27: రేణిగుంట పంచాయతీ పరిధిలో దినసరి కూరగాయల మార్కెట్, బస్టాండు పార్కింగ్, వారపు సంత రుసుము వసూలు హక్కులను పాత టెండరుదారుడికే మరో నెల పొడిగించినట్లు తెలిసింది. దీనిపై సర్పంచు నగేష్ పంచాయతీ కార్యాలయంలోని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. పంచాయతీ ఈవో రవిశంకర్‌రెడ్డి తనకు కనీస సమాచారం ఇవ్వకుండా ఎవరి అనుమతులతో పాతవారికి మార్కెట్ రుసుము వసూలు హక్కులు నెల పొడిగించారని ప్రశ్నించినట్లు తెలిసింది. ఈ విషయమై పంచాయతీ సిబ్బందిని వివరణ కోరగా తమకు ఏం తెలియదని, ఈవో ఒకరోజు సెలవుపెట్టి వెళ్లారని వివరణ ఇచ్చారు. అయితే శనివారం మధ్యాహ్నం కల్లా పాత కాంట్రాక్టర్‌కు ఇచ్చిన అనుమతులు రద్దు చేసి పంచాయతీ సిబ్బంది చేత మార్కెట్ రుసుము వసూలు చేయించడం గమనార్హం.

ఎన్నికల ప్రచారంలో వలంటీర్



వైసీపీ ప్రచారంలో వలంటీర్ స్వాతి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 27: వైసీపీ ఎన్నికల ప్రచారంలో వలంటీర్ పాల్గొన్న ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. పట్టణంలోని 28వ వార్డులో వైసీపీ అభ్యర్థి బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె పవిత్రా రెడ్డి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అదే వార్డుకు చెందిన వలంటీర్ స్వాతి ఆ ప్రచారంలో పాల్గొన్నారు. ఆ ఫొటో సామాజిక మాధ్యమంలో వెలుగు చూసింది. దీంతో టీడీపీ నాయకులు ఎన్నికల సంఘం అధికారులకు ఫిర్యాదు చేశారు. విచారించి తగు చర్యలు తీసుకుంటామని పురపాలక సంఘ కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు.

గులకరాయి డ్రామా ఇంకెన్నాళ్లు జగన్?



బ్యాండ్ ఎయిడ్‌తో నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 27: గులకరాయి డ్రామా ఇంకెన్నాళ్లు కొనసాగిస్తారంటూ సీఎం జగన్ టీడీపీ నేతలు ప్రశ్నించారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ నేతలు ముఖానికి బ్యాండ్ ఎయిడ్ వేసుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.... చిన్న గాయానికే ఇన్ని రోజులు బ్యాండేజ్ ధరించడం హాస్యాస్పదమన్నారు. సీఎంను గాయపరిచిన గులకరాయిని వెతికి పట్టుకుని కఠినంగా శిక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్ కుమార్, కాసరం రమేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మాత్రమే రాష్ట్రాన్ని బాగు చేయగలరు: ఎన్‌ఆర్‌ఐలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌ఆర్‌ఐలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 27: ముందు చూపుతో అభివృద్ధికి బాటలేసే చంద్రబాబు నాయుడు మాత్రమే రాష్ట్రాన్ని బాగు చేయగలరని ఎన్నారైలు అభిప్రాయపడ్డారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో శనివారం ఎన్నారైలు ముఖాలకు బ్యాండ్ ఎయిడ్ వేసుకుని విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వైసీపీ అరాచక పాలనతో భావితరాల భవిష్యత్తు అంధకారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నారైలు స్వచ్ఛందంగా ఎన్డీఏ కూటమి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తామని తెలిపారు. గత ఐదేళ్ల నుంచి వైసీపీ నేతలు వ్యవహరించిన తీరు, మాట్లాడిన మాటలు ప్రపంచవ్యాప్తంగా తెలుగు వారికి తలవొంపులు తెచ్చిందన్నారు. రాష్ట్ర బాగు కోసం తాము నిస్వార్థంగా ప్రచారం చేస్తుంటే వైసీపీ నేతలు తమను గుంట నక్కలుగా సంబోధించడం సిగ్గుచేటన్నారు. ఎన్నారై రాధిక కిరణ్ మాట్లాడుతూ... రాష్ట్రంలో భూకబ్జాలు, అరాచకాలు, దౌర్జన్యాలు, విపరీతంగా పెరిగిపోయాయన్నారు. తాను కూడా భూకబ్జా బాధితురాలుగా మానసిక క్షోభ అనుభవించానని వెల్లడించారు. అధికారులకు ఫిర్యాదు చేస్తే తిరిగి తమ పైన కేసులు నమోదు చేసి పాస్‌పోర్టు సీజ్ చేసి వేధించడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నారైల సమస్యలను పరిష్కరించుకోవడం కోసం ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రతి జిల్లాలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో తిరుపతి పార్లమెంటు ఎన్నారై కోఆర్డినేటర్ నవీన్ కుమార్, గల్ఫ్ కౌన్సిల్ మెంబర్ వెంకట్, కువైట్ నుంచి ఉదయ్ ప్రకాష్, దివాకర్, రమణ, అనిల్, లండన్ నుంచి డాక్టర్ హరిప్రసాద్, యూఎస్ఏ నుంచి దేవరాజ్, సింగపూర్ నుంచి దామోదర్ పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్ తనిఖీ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 27: శ్రీకాళహస్తి పట్టణంలోని స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమును శనివారం జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ తనిఖీ చేశారు. ఈవీఎం యంత్రాలు, ఇతర మెటీరియల్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆర్డీవో రవిశంకర్ రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

సత్యవేడును కాపాడుకుందాం: ఆదిమూలం

నాగలాపురం, ఏప్రిల్ 27: పెత్తందారుల నుంచి సత్యవేడు నియోజకవర్గాన్ని కాపాడుకుందాం అని ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం పేర్కొన్నారు. శనివారం మండలంలోని టీపీకోట, టీపీ పాళ్యం, గోళ్లవారి కండ్రిగ, కడివేడు, బీరకుప్పం, ఎస్ఎస్ పురం, వెల్లూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంచుతూ ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా వరప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆదిమూలం మాట్లాడుతూ సత్యవేడు నియోజకవర్గంలో సహజ వనరులను దోచుకునేందుకు పెద్దిరెడ్డి తన మనిషిని అభ్యర్థిగా పెట్టారని విమర్శించారు.

పుత్తూరు వార్తలు

వైభవంగా కల్యాణ వెంకన్న ఊంజలసేవ



నారాయణవనం, ఏప్రిల్ 27: నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఊంజలసేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి, నిత్యకైంకర్యాలు చేపట్టారు. అనంతరం స్వామివారిని, శ్రీదేవి, భూదేవి ఉత్సవర్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ బట్టాచార్య, శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వెంకన్న ఊంజల సేవ నిర్వహించారు. ఆలయాధికారులు నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

నగరిని దోచుకున్న రోజాను తరిమికొట్టండి: భాను



మీడియాతో మాట్లాడుతున్న గాలి భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 27: నగరి నియోజకవర్గానికి గాలి ముద్దుకృష్ణమనాయుడు, రెడ్డివారి చెంగారెడ్డి, వీఎంసీ దొరస్వామిరాజు, ఈవీ గోపాలరాజు తదితర హేమాహేమీలు ఎమ్మెల్యేలుగా పనిచేశారు. అంతటి నాయకులు ఎక్కడా చిన్న అవినీతికి కూడా పాల్పడలేదు. గత ఐదేళ్లలో నగరిని మంత్రి రోజా పరివారం దోచుకుంది. చెరువులు, గుట్టలు, మట్టి, ఇసుక, కంకర, గ్రావెల్ ఇలా ప్రకృతి సంపదను కొల్లగొట్టి రూ.వందల కోట్లు వెనకేసుకుంది. ఒక్కొక్క మండలాన్ని దోచుకోమని కుటుంబసభ్యులకు పంచిపెట్టింది. ఇలాంటి రోజాను రానున్న ఎన్నికల్లో నగరి నుంచి తరిమికొట్టండి. మీ కోసం, మీ పిల్లల భవిష్యత్తు కోసం టీడీపీకి మద్దతుగా సైకిల్ గుర్తుపై ఓటువేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా దగ్గుమళ్ల ప్రసాద్‌రావును గెలిపించుకోవాలని ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ ఓటర్లను అభ్యర్థించారు. శనివారం పట్టణ పరిధిలోని వినాయకపురం, ముద్దుకృష్ణాపురం, నెత్తం, పుత్తూరు దళితవాడ, ఎన్‌జీవో కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ ప్రభుత్వ అవినీతి, అరాచకాలు, దౌర్జన్యాలు, దోపిడీపై భానుప్రకాష్ చార్జ్‌షీట్ విడుదల చేశారు. ఐదేళ్ల పాలనను వైన్, మైన్, ఎర్త్ ప్రాతిపదికన సాగిందని ధ్వజమెత్తారు. దేశ చరిత్రలో రివర్స్ పీఆర్సీ ప్రకటించి ఉద్యోగులను వంచించిన ఘనత జగన్‌కే దక్కుతుందని మండిపడ్డారు. వ్యవసాయరంగం పూర్తిగా కుదేలైందని చెరుకు రైతులకు బకాయిలు ఇప్పటి వరకు చెల్లించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మామిడి రైతులు గిట్టుబాటు ధర లేక విలవిల్లాడుతుంటే ప్రభుత్వం మొద్దునిద్ర పోతోందని విమర్శించారు. అచారక పాలన ముగింపు కోసం ప్రతి ఒక్కరూ టీడీపీకి మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.



బాలినాయుడు కండ్రిగలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

సుపరిపాలన కోసం టీడీపీని గెలిపించండి

వడమాలపేట, ఏప్రిల్ 27: రాష్ట్రంలో సుపరిపాలన కోసం టీడీపీని గెలిపించాలని చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి దుగ్గినేని ధనంజయులు నాయుడు కోరారు. శుక్రవారం బాలినాయుడు కండ్రిగ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారం చేపడితే సూపర్ సిక్స్ పథకాలతో చంద్రన్న సుపరిపాలన అందిస్తారని ప్రజలకు అవగాహన కల్పించారు. సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి నగరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో అదెయ్య, షణ్ముగం, దుర్వాసులు, బాల, డేగయ్య, చంద్ర, ఉమాపతి, తిరుమల, వెంకటేష్, ప్రశాంత్, గోవిందయ్య, గురవయ్య, హిమగిరి, జగదీశ్వర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.